ప్రతి అక్షరం - ప్రజల కోసం

# రోమింగ్ న్యూస్

తెలుగు దినపత్రిక

యాదాద్రి భువనగిరి

పేజీలు : 8
సంపుటి : 3
సంచిక : 218

మంగళవారం 11 ఫిబ్రవరి 2025 / చీఫ్ ఎడిటర్ : గొట్టిపర్తి భాస్కర్

HYDERABAD, KARIMNAGAR, KHAMMAM, NALGONDA, NIZAMABAD, WARANGAL, MAHABUBNAGAR.RANGAREDDY, MEDAK, ADILABAD





## కమనీయం పాత గుట్ట శ్రీలక్ష్మీనరసింహుని కళ్యాణం!!

### శభాష్ ఈఓ భాస్కర్ రావు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:యాదగిరిగుట్ట శ్రీ పూర్వగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కమనీయంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వెంకటాచార్యుల అర్చకత్వంలోని అర్చక బృందం కన్నులపండుగగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన కల్యాణ మహోత్సవం దాదాపు రెండు గంటల పాటు కమనీయంగా, నయనానందకరంగా జరిగింది. యాదగిరిగుట్ట టెంపుల్ కు అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు కనువిందుగా జరుగుతున్నాయి. నాలుగో రోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెళ్లికొడుకుగా ముస్తాబైన స్వామివారు గజవాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగుతూ కల్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం కల్యాణ మండపంలో అర్చకులు స్వామిఅమ్మవార్లను అధిష్టింపజేసి కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు.





02

## పెండ్లికి సాయం చేస్తానని..

యువతిపై ఆటో డ్రైవర్ లైంగిక దాడి

జూబ్లీహిల్స్‌ఠాణాలో కేసు నమోదు



04

## మరోమారు పడిపోయిన రూపాయి విలువ

ట్రంప్ సుంకాల కొరడాతో మార్కెట్లో ఒడిదుడుకులు



04

## పాతబస్తీలో అగ్ని ప్రమాదాలు

సుమారుగా 30 షాపులు దగ్ధం



# పరీక్షలే సర్వస్వం కాదు

## మనం రోబోలం కూడా కాదు

- పరీక్షలను సమర్థంగా ఎదుర్కొనేలా ముందుకు సాగాలి
- బంతిపై బ్యాటర్ దృష్టిలా చదువుపై శ్రద్ధ పెట్టాలి
- తల్లిదండ్రులు కూడా పిల్లలపై ఒత్తిడి పెంచరాదు
- పరీక్షాపై చర్చా కార్యక్రమంలో ప్రధాని మోడీ



**న్యూఢిల్లీ, రోమింగ్‌న్యూస్ :** తల్లిదండ్రులు తమ పిల్లలను మోడల్స్‌గా ప్రదర్శించవద్దని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సూచించారు. పరీక్షలే సర్వస్వం కాదన్నారు. మనం రోబోలం కాదని, మనషులమని, ఒక దగ్గరే గిరిగీసుకొని ఉండొద్దని సూచించారు.'బయటినుంచి వచ్చే ఒత్తిడి మీద కాకుండా చదువుమీద దృష్టిపెట్టాలి. స్టేడియంలో వీక్షకులు కేకలేస్తూ, కేరింతలు కొడుతూ ఎంతగా శబ్దాలు

మిగతా 2 లో

## తెలంగాణలో ఏడాదిగా కౌరవ పాలన

- అధికారంలోకి వచ్చాక రైతులు సహా అందరినీ మోసం
- రైతులు భూములు గుంజుకోవడమే రేవంత్‌కు తెలుసు
- బిఆర్ఎస్ రైతు నిరసన సభలో కెటిఆర్




03

## ఎన్నికలకు ముందు కూతలు అధికారంలోకి రాగానే కోతలు

అన్నివర్గాలను మోసం చేసిన రేవంత్ : హరీష్ రావు




03

## అర్చకుడిపై దాడి నిందితుడి అరెస్ట్

### మరో ఐదుగురు నిందితులు సైతం

పరారీలో మరికొందరు.. అర్చకుడికి బండి, కేటీఆర్‌పరామర్శ



**హైదరాబాద్, రోమింగ్‌న్యూస్ :** చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ పై 20 మందితో కలిసి దాడి చేసిన వీర రాఘవ రెడ్డిని ఆదివారం అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు రాఘవరెడ్డితో పాటు మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే మిగిలిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాఘవ రెడ్డి అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకి వస్తున్నాయి. వీరరాఘవరెడ్డిపై 2015లో అబిడ్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. రామరాజ్యం

మిగతా 2 లో



02

## కుంభమేళాకు హాజరైన రాష్ట్రపతి ముర్ము

- ఘనంగా స్వాగతించిన సిఎం యోగి, గవర్నర్ ఆనందీబెన్
- త్రివేణి సంగమంలో పుణ్యస్నానం ఆచరించిన ద్రౌపది

## ఇంకెంత టైం కావాలి

- 10 నెలల సమయం సరిపోలేదా?
- ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణపై సుప్రీం ఆగ్రహం
- మరింత సమయం కావాలని కోరిన అసెంబ్లీ కార్యదర్శి
- మరోమారు 18కి వాయిదా వేసిన ధర్మాసనం



**న్యూఢిల్లీ, రోమింగ్‌న్యూస్ :** భారాస ఎమ్మెల్యేల అనర్హత పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ మరోమారు వాయిదా పడింది. ఏడుగురు ఎమ్మెల్యేలపై దాఖలు చేసిన అనర్హత పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడంలో తెలంగాణ స్పీకర్ జాప్యం చేస్తున్నారంటూ భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ సుప్రీంకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. కేటీఆర్ తన పిటిషన్‌లో తెలంగాణ స్పీకర్, ఎమ్మెల్యేలు పి.శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలె యాదయ్య, టి.ప్రకాశ్‌గౌడ్, అరెకపూడి గాంధీ, గూడెం మహిపాల్‌రెడ్డి,

మిగతా 2 లో

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఫిబ్రవరి
2025





# యువతిపై ఆటోడ్రైవర్ లైంగిక దాడి



**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** పెండ్లికి సాయం చేస్తానని నమ్మించి యువతిపై ఓ డ్రైవర్ లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆదివారం రాత్రి ఈ ఘటన చోటుచేసుకోగా.. ఆలస్యంగా విషయం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకివెళితే.. జూబ్లీహిల్స్‌లోని ఓ బంగ్లాలో వాచ్‌మెన్ అతని కూతురు (19) ఉంటున్నారు. ఈ క్రమంలోనే అదే బంగ్లాలో డ్రైవర్‌గా పనిచేస్తున్న శివ నరసింహ అనే వ్యక్తి వాచ్ మెన్ కూతురి పెండ్లికి సాయం చేస్తానని నమ్మించాడు. ఈ క్రమంలోనే నిన్న రాత్రి యువతి ఒంటరిగా ఉండటం చూసి ఆమె గదిలోకి వచ్చాడు. పెండ్లి టాపిక్ తీసి ఆమెను ఏమార్చి బలవంతం చేశాడు. యువతి ప్రతిఘటించడంతో దిండుతో నోరు నొక్కేసి యువతిపై డ్రైవర్ లైంగికడాడికి పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు తమకు న్యాయం చేయాలంటూ జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శివ నరసింహపై లైంగికదాడి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

# కుంభమేళాకు రాష్ట్రపతి హాజరు



**ప్రయాగరాజ్,ఫిబ్రవరి10 :** ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళాలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము పాల్గొన్నారు. సోమవారం ఉదయం ఢిల్లీ నుంచి బయల్దేరిన ముర్ము.. 10 గంటలకు ప్రయాగ్‌రాజ్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్రపతికి యూపీ గవర్నర్ ఆనందీ బెన్ పటేల్, సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి మహాకుంభమేళా ప్రాంతానికి చేరుకున్నారు. త్రివేణీ సంగమ ప్రాంతంలో పడవలో విహరించారు. ఈ సందర్భంగా సంగమం వద్ద వలస పక్షులకు ఆహారం అందించారు. అనంతరం గంగా, యమునా, సర్వసతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్యస్నానం ఆచరించి గంగమ్మకు ప్రార్థనలు చేశారు. రాష్ట్రపతి ప్రయాగ్‌రాజ్‌లో ఎనిమిది గంటలకు పైగా ఉండనున్నారు. బడే హనుమాన్ ఆలయం, పవిత్రమైన అక్షయవత్ వృక్షాన్ని సందర్శిస్తారు. అదేవిధంగా కుంభమేళా ప్రదేశంలో ఏర్పాటు చేసిన డిజిటల్ కుంభ్ అనుభవ్ సెంటర్‌ను పరిశీలిస్తారు. సాయంత్రం 5.45 గంటలకు ప్రయాగ్‌రాజ్ నుంచి న్యూఢిల్లీకి బయల్దేరుతారు. ఈ నేపథ్యంలో భద్రతా ఏర్పాట్లను కట్టుదిట్టం చేశారు. జనవరి 13న పుష్య పౌర్ణమి సందర్భంగా మహాకుంభ్ మేళా ప్రారంభమైన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26న మహాశివరాత్రి పర్వదినం వరకు ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక కార్యక్రమం కొనసాగుతుంది. ఇప్పటివరకూ 42 కోట్ల మందికి పైగా భక్తులు గంగానదిలో పవిత్రస్నానాలు ఆచరించారు. కాగా, ఈ నెల 5న ప్రధాని మోదీ కూడా కుంభమేళాలో పాల్గొన్నారు. త్రివేణీ సంగమంలో పుణ్యస్నానమాచరించారు. గంగానదికి హారతి ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. 90 నిమిషాల పాటు ఆయన మహాకుంభమేళాలో గడిపారు.

# సంక్షేమ పథకాల అమల్లో అధికారులకు సూచనలు

**హైదరాబాద్,ఫిబ్రవరి10:** తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అధికారులకు కీలక సూచనలు చేస్తోంది. ఎన్నికల వేళ ఇచ్చిన హామీల అమలు దిశగా కసరత్తు కొనసాగుతోంది. అందులో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల పంపిణీ విషయంలో తాజాగా అధికారులకు కీలక సూచనలు అందాయి. ప్రతీ మండలంలో ఒక గ్రామాన్ని ఎంపిక చేసి లబ్దిదారుల జాబితాను సిద్ధం చేశారు. ఇక, ఈ గ్రామాల్లో ఇళ్ల గ్రౌండింగ్ కోసం ఏర్పాటు ప్రారంభించారు. ముందుగా ఆ గ్రామాల్లో ప్రీ గ్రౌండింగ్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రీ గ్రౌండింగ్ తెలంగాణ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారలు కోసం ఎంపిక చేసిన గ్రామాల్లో ప్రీ గ్రౌండింగ్ సమావేశాల నిర్వహణ దిశగా కసరత్తు చేస్తోంది. ఎంపికైన లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణం లో అనుసరిం చనాల్సిన విధానాలు.. నిర్మాణ సామాగ్రి.. ఎలా నిర్మాణం చేపట్టాలనే వాటితో పాటుగా వారి సందేహాలకు పరిష్కారం చూపేలా ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. ఇప్పటికే లబ్ధిదారులకు పథకం అమలుకు సంబంధించి విధి విధానాలు ఖరారు చేసింది. అందులో భాగంగా ఇందిరమ్మ యాప్ సర్వే సమయంలో సొంత స్థలం చూపిన ప్రాంతంలో లబ్ధిదారుడే ముగ్గు పోసుకోవాల్సి ఉంటుంది. లబ్ధిదారుడు మరోచోట ఇల్లు కట్టుకుంటాననంటే ఆ ఇంటిని అధికారులు రద్దు చేస్తామని అధికారులు స్పష్టం చేస్తున్నారు. 47 ఏళ్ల ముసలి సీఎంను రహస్యంగా పెళ్లి చేసుకున్న నందమూరి హీరోయిన్ లబ్దిదారుల కోసం తమ స్థలంలో లబ్దిదారుడు ముగ్గు పోసుకొని సిద్దమైన తరువాత సమాచారం ఇస్తే గ్రామ కార్యదర్శి అక్కడకు వచ్చి వారిని ఫొటోలు తీసుకొని ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తారు. నిర్మాణ ప్రదేశాన్ని జియో ట్యాగింగ్ చేసి ఇస్తారు. అదే విధంగా ప్రతీ లబ్దిదారుడు కనీసం 400 చదరపు అడుగులు కంటే తక్కువ కాకుండా ఇంటిని నిర్మించుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసారు. పునా ది పూర్తయిన తర్వాతే మొదటి విడతలో రూ.లక్షను లబ్ధిదారుడి ఖాతాలో ప్రభుత్వం జమ చేయనుంది. ప్రతి ఇంటికి 8 ట్రాక్టర్ల ఇసుకను అందించాలని నిర్ణయించగా, దీనికి సంబంధించి కూపన్లను తహసీల్దార్ లేదా ఆర్డీవో ద్వారా అందించాలని స్పష్టం చేసారు. నియోజకవర్గాల వారీగా ప్రభుత్వం మొదటి విడతలో 71,482 ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించింది. కాగా, ఇందులో 21 నియోజకవర్గాల్లో 1000కి పైగా ఇళ్లను ఇవ్వనుంది. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో 2,528 ఇళ్లు , మంథని 1,952, బోథ్ 1,538, పరకాల 1,501 ఇళ్ల పంపిణీకి నిర్ణయించారు. ఆ తరువాత వరుసగా హుస్నాబాద్, సిర్పూర్, దుబ్బాక, పరిగి, బెల్లంపల్లి, జహీరాబాద్ వంటి నియోజకవర్గాల ల్లో ఇళ్లను ఇవ్వాలని నిర్ణయించారు. మిగిలిన నియోజకవర్గాల్లో వెయ్యి వరకు ఇళ్లను ఇచ్చేందుకు ఎంపిక చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ పై కసరత్తు కొనసాగుతున్న వేళ పథకాల అమలు విషయంలో కీలక నిర్ణయాలు జరుగుతున్నాయి.

# ఇంకెంత టైం కావాలి



మొదటి పేజీ తరువాయి

ఎం.సంజయ్‌కుమార్‌లను ప్రతివాదులుగా చేర్చారు. జస్టిస్ గవాయ్ ధర్మాసనం ఇవాళ ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది.అసెంబ్లీ కార్యదర్శి తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. స్పీకర్ నుంచి సమాచారం కోసం మరింత సమయం కావాలని రోహత్గీ కోర్టును కోరారు. స్పీకర్‌తో చర్చించి వివరాలు అందిస్తామని తెలిపారు. ఇప్పటికే 10 నెలలు పూర్తయిందని.. ఇంకెంత గడువు కావాలని ధర్మాసనం ప్రశ్నించింది. ముకుల్ రోహత్గీ విజ్ఞప్తితో పిటిషన్‌పై తదుపరి విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. పార్టీ మారిన ఎమ్మెల్యేలను అనర్హులుగా ప్రకటించాలని కోరుతూ ఈ పిటిషన్ పెట్టారు. ఈ పిటిషన్‌పై జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్ చంద్రన్ ధర్మాసనం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా సుప్రీం కోర్టు ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. పార్లమెంటరీ పక్రియను ఫ్రస్టేషన్‌కు గురి చేయొద్దని, ప్రజాస్వామ్యంలో పార్టీలకు హక్కులు ఉంటాయని తెలిపింది. ఎమ్మెల్యేలు పార్టీలు మారి 10 నెలలు అయింది.. ఇది రీజనబుల్ టైం కాదా అంటూ సుప్రీం కోర్ట్ ప్రశ్నించగా..మాకు



వాదనలు వినిపించేందుకు రెండు మూడు రోజుల సమయం కావాలని రోహిత్గి కోరారు. మరోవైపు సుప్రీంకోర్టు ఇచ్చిన గత తీర్పుల ప్రకారం రీజనబుల్ టైమ్ అంటే మూడు నెలలు మాత్రమేనని బిఆర్ఎస్ వాదిస్తుంది. రీజనబుల్ టైమ్ అంటే ఎంత సమయం కావాలో చెప్పండని కోర్టు లేవనెత్తింది. అనంతరం ఇరు పక్షాల వాదనలు విన్న కోర్టు, ఈ పిటిషన్‌పై విచారణను ఫిబ్రవరి 18కి వాయిదా వేసింది. పార్టీ మార్పులు ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగించేలా ఉంటాయని కేటీఆర్ ఆరోపించారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల చర్యలతో ప్రజల నమ్మకాన్ని ద్రోహం చేసినట్లు కేటీఆర్ అభిప్రాయపడ్డారు. ఈ కేసు తదుపరి విచారణకు వేచి చూడాల్సి ఉంది. బిఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌కు వెళ్లిన పది మంది ఎమ్మెల్యేలపైన అనర్హత వేటు వేయాలని గులాబీ పార్టీ వరుస పిటిషన్లు దాఖలు చేసింది. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డితో పాటు వివేకానంద గౌడ దాఖలు చేసిన రెండు పిటిషన్లతో పాటు ఇటీవల తాజాగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కూడా ఒక పిటిషన్ దాఖలు చేశారు. గతంలో పాడి కౌశిక్ రెడ్డి, వివేకా కలిసి పార్టీ ఫిరాయించిన ముగ్గురు ఎమ్మెల్యేలపై పిటిషన్ వేయగా.. మరో ఏడుగురి పేర్లను జత చేసి కేటీఆర్ మరో పిటిషన్ దాఖలు చేశారు. ఆ రెండు పిటిషన్లను జత చేసి ఈరోజు సుప్రీం ధర్మాసనం విచారణ జరిపింది.ఎమ్మెల్యేలు పార్టీ ఫిరాయించి దాదాపు 10 నెలలు అవుతున్నా ఎలాంటి చర్యలు తీసుకోలేదని... వారిపై చర్యలు తీసుకోవాల్సిందిగా తెలంగాణ స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వాలని కోర్టు ముందు వాదనలు వినిపించారు బీఆర్ఎస్ తరపు న్యాయవాది. అనంతరం కేసు విచారణను 18కి వాయిదా వేసింది ధర్మాసనం. ఈ క్రమంలో 18న జరగబోయే వాదనలపై ఉత్కంఠ నెలకొంది.

# పరీక్షలే సర్వస్వం కాదు..



మొదటి పేజీ తరువాయి

చేస్తున్నా.. బ్యాటర్ దృష్టి మాత్రం బంతిపైనే ఉంటుంది. అలాగే విద్యార్థులు కూడా నేర్చుకోవడంపైనే దృష్టిపెట్టాలి' అని అన్నారు. కంటినిండా నిద్ర, సమతుల ఆహారం ముఖ్యమని, ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయొద్దని సూచించారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇతర పిల్లల్లాగే ఉండేలా చూడాలని, మీ పిల్లలు వారికి అత్యంత ఆసక్తి ఉన్న అంశాల గురించి చదివేలా చేయాలని మోదీ సూచించారు. పరీక్షా పే చర్చా కార్యక్రమంలో పిల్లలతో ముచ్చటించారు. పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థుల్లో స్ఫూర్తి నింపేందుకు ఏటా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'పరీక్షా పే చర్చా' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. 8వ ఎడిషన్ పరీక్షా పే చర్చ వీడియోను సోమవారం ప్రధాని మోదీ తన ఎక్స్ ఖాతాలో షేర్ చేశారు. దిల్లీలోని సుందరవనంలో ఈ కార్యక్రమం జరిగింది. ఎప్పుడూ ఒక పెద్ద హాల్‌లో పరీక్షలకు సంబంధించిన అనుమానాలు, ఒత్తిడి తట్టుకోవడం ఎలా అనే అంశాలపై సోదాహరణంగా వివరించే మోదీ.. ఈసారి విభిన్నంగా విద్యార్థులతో ముచ్చటించారు. సుందరవనంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు ప్రధాని బదులిచ్చారు.పిల్లలు తమ ఆసక్తులను కూడా దృష్టిలో ఉంచుకోవాలని, అందరితో బహిరంగంగా మాట్లాడాలని, తల్లిదండ్రులు తమ సమస్యలను పిల్లలపై రుద్దకూడదని ప్రధానమంత్రి మోదీ అన్నారు. ప్రతి పిల్లలు ఏదో ఒక రంగంలో రాణిస్తారని అన్నారు. ఈ కార్యక్రమం కోసం 3.15 కోట్ల మంది విద్యార్థులు రిజిస్టర్ చేసుకోగా, వారిలో 19.80 లక్షల మంది టీచర్లు, 5.20 లక్షల మంది తల్లిదండ్రులు ఉన్నారు. నేరుగా మాత్రం 36 మంది, మిగతావారంతా వర్చువల్‌గా పాల్గొన్నారు. 'ప్రతి విద్యార్థికి భిన్నమైన టాలెంట్ ఉంటుంది. కొంతమంది చదువులో ముందుంటారు. మరికొందరికి మంచి డ్రెస్సింగ్ స్టైల్ ఉంటుంది. విద్య సమగ్ర అభివృద్ధి కోసం ఉద్దేశించినది. విద్యార్థులు నాలుగు గోడలకే పరిమితం కాకూడదు. వారు తమ అభిరుచుల వైపు మళ్లేందుకు స్వేచ్ఛ అవసరం. పరీక్షలే సర్వస్వం అనే భావనలో జీవించకూడదు. పిల్లలకు సలహాలు ఇవ్వకూడదు. వారిలో ఎలాంటి నైపుణ్యాలు ఉన్నాయో గమనించాలి. వారిలో ఉన్న విశిష్టమైన ప్రతిభను వెలికితీయాలి' అని చిన్నారులు, టీచర్లకు మోదీ సూచించారు. ఈ సందర్భంగా క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్‌ను ప్రధాని ఉదహరించారు. 'సచిన్‌కు చదువు కంటే ఆటల మీదే ఆసక్తి ఎక్కువ ఉండేది. దాన్ని గుర్తించిన అతడి తల్లిదండ్రులు ఆ దిశగా ప్రోత్సహించారు' అని ప్రధాని గుర్తుచేశారు. 'సమయపాలన అన్నింటికంటే ముఖ్యం. రేపు మీరు ఏం చేయాలని అనుకుంటున్నారో ఒక కాగితం మీద రాసుకోవాలి. ఏ పని కోసం ఎంత సమయం వెచ్చించాలో ఆలోచించుకోండి. మీకు ఇష్టమైన సబ్జెక్ట్‌కు ఎక్కువ సమయం, ఇష్టం లేని దానికి తక్కువ సమయం కేటాయించొద్దు. దానికి భిన్నంగా చేయండి. కష్టమైన పాఠ్యాంశాన్ని ఒక సవాలుగా స్వీకరించండి' అని సలహా ఇచ్చారు. 'స్నేహితుల్లో మంచి లక్షణాలు గమనించండి. దానివల్ల ప్రతి పనిలో సానుకూలతను చూసే అలవాటు పెరుగుతుంది. ఇక స్నేహితుల కష్టాలను అర్థం చేసుకునేందుకు వారితో మాట్లాడండని అన్నారు. కేరళ నుంచి వచ్చిన విద్యార్థి ఆకాంన్షా ప్రధాని మోదీని హిందీలో పలకరించారు. దాంతో ఆశ్చర్యపోయిన ఆయన.. ఇంత చక్కగా హిందీ ఎలా నేర్చుకున్నావంటూ ప్రశ్నించారు. 'నాకు హిందీ అంటే చాలా ఇష్టం. నేనొక కవిత కూడా రాశా' అంటూ దానిని చదివి వినిపించారు. అలాగే.. మీరు ప్రధాని కాకపోయి ఉంటే ఏ మంత్రిత్వ శాఖ తీసుకుంటారని ఓ విద్యార్థి మోదీని అడిగారు. దీనికి ఆయన బదులిస్తూ.. 'నైపుణ్యాభివృద్ధి శాఖ అంటే ఆసక్తి' అని చెప్పారు. 'నైపుణ్యాలు చాలా ముఖ్యమైనవి కాబట్టి నేను నైపుణ్యాల విభాగాన్ని ఎంచుకుంటాను అని చెప్పారు. తల్లిదండ్రులు కూడా తమ పిల్లల నైపుణ్యాలపై దృష్టి పెట్టాలన్నారు. పిల్లలు అలసిపోతే పరీక్షల్లో బాగా రాయగలరా? అని అన్నారు. మనం రోబోలము కాదు, మనుషులం. పిల్లలను నాలుగు గోడల మధ్య బంధించి పుస్తకాల చెరసాలలో వేస్తే, వారు ఎప్పటికీ ఎదగలేరు అని ప్రధానమంత్రి అన్నారు. వారికి బహిరంగ ఆకాశం కల్పించాలని, స్వేచ్ఛ కూడా అంతే ముఖ్యమని అన్నారు. పరీక్షల ఒత్తిడి నుండి విద్యార్థులను విముక్తి చేయడమే ఈ కార్యక్రమం లక్ష్యం. కొన్ని సంవత్సరాలుగా ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఈ కార్యక్రమం లక్ష్యం విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడం, వారి ఒత్తిడి స్థాయిలను తగ్గించడం, వారు ఆరోగ్యంగా ఉండటానికి ప్రేరేపించడమే ఉద్దేశం.


# అర్చకుడి రంగరాజన్ దాడి కేసులో వీరరాఘవరెడ్డి అరెస్ట్

**హైదరాబాద్, ఫిబ్రవర 10:** చిలుకూరు బాలాజీ ఆలయ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్ పై 20 మందితో కలిసి దాడి చేసిన వీర రాఘవ రెడ్డిని ఆదివారం అరెస్ట్ చేశారు. ప్రధాన నిందితుడు రాఘవరెడ్డితో పాటు మరో ఐదుగురిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే మిగిలిన వారికోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ క్రమంలో రాఘవ రెడ్డి అరాచకాలు ఒక్కొక్కటిగా బయటకి వస్తున్నాయి. వీరరాఘవరెడ్డిపై 2015లో అబిడ్స్ పోలీస్ స్టేషన్ లో కేసు నమోదైంది. రామరాజ్యం పేరుతో తనకు ప్రత్యేక చట్టం ఉందని యూట్యూబ్ ద్వారా ప్రచారం చేసుకుంటున్నట్లు తెలుస్తుంది. దీంతో వీరరాఘవరెడ్డి వెనుక ఎవరు ఉన్నారో తేల్చాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఇదిలా ఉంటే ఆయనపై 2 రోజుల కింద దాడి జరగ్గా.. ఆదివారం తన తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేయడం కూడా పలు అనుమానాలను సృష్టిస్తుందని పలువురు చెబుతున్నారు. నిందితులు ఎంతటి వారైనా సరే శిక్షించాలని పలువురు తెలిపారు.

## రంగరాజన్‌కు బండి సంజయ్ పరామర్శ

రంగరాజన్‌పై దాడిని కేంద్ర హోమ్‌శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ ఖండించారు. ఈ మేరకు ఆయన సోమవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. రంగరాజన్‌కు ఫోన్ చేసి పరామర్శించినట్లు వెల్లడించారు. అరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయనకు అవసరమైన సహాయం అందిస్తామని హామీ ఇచ్చినట్లు ట్వీట్ చేశారు. దాడి జరిగిన తీరుపై ఆరా తీశారు. ఎంతో పేరొందిన చిలుకూరి ఆలయ ప్రధాన అర్చకుడిపై దాడిని హిందూ సంఘాలు, తెలంగాణ ప్రజలు ఖండించారు. అదేవిధంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ రాజకీయ నాయకులు సైతం ఖండిస్తున్నారు. నిందితులను ఎంతటి వారైనా సరే శిక్షించాలని డిమాండ్ చేస్తున్నారు.

## దాడి చేయడానికి కారణమేంటి..?



రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు సీఎస్ రంగరాజన్‌పై దాడి ఘటన ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. 20 మంది ఇంటికి వెళ్లి బెదిరించి దాడి చేసినప్పటికి 2రోజుల వరకు వార్త బయటకు రాలేదు. రంగరాజన్ తండ్రి పోలీస్ కంప్లైంట్‌తో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే వీరరాఘవరెడ్డి అనే వ్యక్తి రామసైన్యం స్థాపన పేరుతో తన దగ్గరకు వచ్చిన భక్తులను చేర్పించాలని బెదిరించాడు. అందుకు రంగరాజన్ ఒప్పుకోకపోవడంతో ఈదాడికి పాల్పడటం జరిగింది. ప్రతిపక్ష పార్టీలు బీఆర్ఎస్, బీజేపీలు ఈ దాడి తీవ్రంగా ఖండించాయి. దాడికి పాల్పడిన వాళ్లను వదిలిపెట్టవద్దని డిమాండ్ చేస్తున్నాయి.

# ఫుడ్ సేఫ్టీ తనిఖీలు

## రాజేంద్రనగర్‌లో రెండు హోటళ్లలో అపరిశుభ్రత

## కాలం చెల్లిన పదార్థాలతో వంటకాలు



**హైదరాబాద్, ఫిబ్రవరి 10:** వివిధ రకాల వంటకాలకు బ్రాండ్ అయిన హైదరాబాద్‌లో రోజు రోజుకు ఆహార కల్తీ ఘటనలు పెరిగిపోతున్నాయి. నిత్యం ఏదో ఒక చోట ఫుడ్ కల్తీ ఘటనలు వెలుగు చూస్తున్నాయి. బిర్యానీలో బల్లి.. సాంబార్‌లో బొద్దింక వంటి వార్తలు నిత్యం వినిపిస్తున్నాయి. ధనార్జనే లక్ష్యంగా కొందరు హోటళ్ల నిర్వాహకులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. కుళ్లిన కూరగాయలు.. ఎకాలంచెల్లిన పదార్థాలతో వంటలు చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. దీంతో బయట ఫుడ్ తినాలంటేనే నగరవాసులు జంకే పరిస్థితి తలెత్తింది. ఆహార కల్తీ ఘటనలు రోజు రోజుకు పెరిగిపోతుండటంతో ఫుడ్ సేఫ్టీ అధికారులు దూకుడు పెంచారు. నగరంలో నిత్యం ఏదో ఒక చోట తనిఖీలు చేయడంతో పాటు.. కస్టమర్ల నుంచి ఫిర్యాదు వచ్చిన వెంటనే అక్కడి వెళ్లి సోదాలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలోనే సోమవారం హైదరాబాద్ సిటీలోని పలు ప్రాంతాల్లో జీహెచ్ఎంసీ ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు చేశారు. రాజేంద్ర నగర్‌లోని ది ఫోర్ట్, డెలిష్ బై హోమ్స్ కిచెన్ రెస్టారెంట్?లో అధికారులు చెక్ చేశారు.తనిఖీల్లో భాగంగా.. రెండు హోటల్స్ ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించట్లేదని అధికారులు గుర్తించారు. కిచెన్ పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో పాటు.. కుళ్లిపోయిన కూరగాయలు వాడుతున్నట్లు గుర్తించి హోటల్ నిర్వాహకులపై అధికారులు మండిపడ్డారు. ఏకంగా కిచెన్‌లో బొద్దింకలు తిరుగుతుండటంతో చూసిన అధికారులు.. ప్రజల ప్రాణాలతో చెలగాటమాడమేంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. రెస్టారెంట్లో గడువు ముగిసిన ఫుడ్ ఇన్గ్రీడియంట్స్ వాడుతున్నట్లు గుర్తించిన అధికారులు వాటిని సీజ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ నిబంధనలు పాటించకపోవడంతో రెస్టారెంట్ నిర్వాహకులకు ఫుడ్ సేఫ్టీ అధికారులు నోటీసులిచ్చారు. ఇకపై ఇలాంటి మళ్లీ పునరావృతం అయితే సీరియస్ యాక్షన్ తీసుకుంటామని హెచ్చరించారు. ఫుడ్ కల్తీ చేసి ప్రజల ఆరోగ్యాలతో చెలగాటమాడొద్దని వార్నింగ్ ఇచ్చారు ఫుడ్ సేఫ్టీ అధికారులు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఫిబ్రవరి
2025





# 'కమనీయం...శ్రీలక్ష్మీ నరసింహుని కల్యాణం

## ఉదయం హనుమంత వాహనం, రాత్రి గజవాహనంపై విహరించిన పూర్వగిరీశుడు.. శభాష్ ఈఓ భాస్కర్ రావు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:

యాదగిరిగుట్ట శ్రీ పూర్వగిరి శ్రీలక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య కళ్యాణ మహోత్సవం సోమవారం రాత్రి కమనీయంగా నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల తిరుకల్యాణ మహోత్సవాన్ని ఆలయ ప్రధానార్చకులు నల్లంథీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు, కాందూరి వెంకటాచార్యుల అర్చకత్వంలోని అర్చక బృందం కన్నులపండుగగా నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ప్రారంభమైన కల్యాణ మహోత్సవం దాదాపు రెండు గంటల పాటు కమనీయంగా, నయనానందకరంగా జరిగింది. యాదగిరిగుట్ట టెంపుల్ కు అనుబంధ ఆలయమైన పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్ర వార్షిక బ్రహ్మోత్సవాలు కనువిందుగా జరుగుతున్నాయి. నాలుగో రోజు బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెళ్లికొడుకుగా ముస్తాబైన స్వామివారు గజవాహనంపై ఆలయ తిరువీధుల్లో ఊరేగుతూ కల్యాణ మండపానికి చేరుకున్నారు. అనంతరం కల్యాణ మండపంలో అర్చకులు స్వామిఅమ్మవార్లను అధిష్టింపజేసి కల్యాణ ఘట్టాన్ని నిర్వహించారు. శ్రీవారి కల్యాణం సందర్భంగా.. ప్రభుత్వం తరపున జిల్లా కలెక్టర్ హనుమంతరావు, యాదగిరిగుట్ట దేవస్థానం తరపున చైర్మన్ నర్సింహమూర్తి, ఈవో ఎన్. భాస్కర్ రావు స్వామి అమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మహామంత్ర పుష్పపఠనం, చతుర్వేద పారాయణాల నడుమ, మంగళవాయిద్యాల హోరులో ముల్లోకాది దేవతలు చూస్తుండగా.. వేదపండితులు నిశ్చయించిన సుముహూర్తమున నరసింహస్వామివారు లక్ష్మీఅమ్మవారి మెడలో మాంగళ్యధారణ చేసే తంతును అర్చకులు నేత్రపర్వంగా నిర్వహించారు. అనంతరం స్వామిఅమ్మవార్లకు ఆలయ అర్చకులు, వేదపండితుల కలిసి తలంబ్రాల వేడుకను నేత్రపర్వంగా జరిపించారు. కల్యాణ ఉత్సవ వేళ భక్తులు చేసిన "నమో నారసింహ, జై నారసింహ, గోవిందా" నామస్మరణతో ఆలయ వీధులు మార్మోగాయి. లోక కల్యాణం, జగత్ రక్షణ కోసం స్వామివారు లక్ష్మీదేవి మెడలో మంగళసూత్రధారణ గావించారని, స్వామివారి కరుణాకటాక్షాలు అమ్మవారితో పాటు సమస్త లోకాలకు సంతరిస్తాయని అర్చకులు ప్రవచించారు. అంతకుముందు బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం ఉదయం నారసింహుడు శ్రీరామచంద్రుడి అవతారంలో హనుమంత వాహనంపై ఆలయ తిరువీధుల్లో విహరించి భక్తులను పరవశింపజేశారు.























### కల్యాణంలో పాల్గొన్న ప్రభుత్వ విప్ అయిలయ్య దంపతులు

పాతగుట్టలో రాత్రి జరిగిన లక్ష్మీనారసింహుల తిరుకల్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అనిత దంపతులు పాల్గొన్నారు. వ్యక్తిగత హోదాలో స్వామిఅమ్మవార్లకు పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. మరోవైపు స్వామివారి కల్యాణం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎక్కడికక్కడ బారికేడ్లు, జిగ్ జాగ్ బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రొటెక్షన్ కల్పించారు. దీంతో ఎలాంటి ఘటనలు తలెత్తకుండా స్వామివారి కల్యాణం ప్రశాంతంగా ముగిసింది.

### నేడు దివ్యవిమాన రథోత్సవం

బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన దివ్య విమాన రథోత్సవం మంగళవారం రాత్రి 8 గంటలకు నిర్వహించనున్నారు. ఉదయం గరుడ వాహనంపై స్వామివారు ఆలయ మాడవీధుల్లో ఊరేగనున్నారు. సాయంత్రం 5 గంటలకు రథాంగ హోమం నిర్వహించిన అనంతరం రాత్రి 8 గంటల నుండి రథోత్సవ వేడుకను జరపనున్నారు.

### శభాష్ ఈఓ భాస్కర్ రావు

పాతగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి కళ్యాణ మహోత్సవ నిర్వహణలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి ఎన్. భాస్కరరావు చూపించిన చొరవ వల్ల కల్యాణోత్సవం అద్భుతంగా జరిగిందన్న ప్రశంసలు వెల్లువెత్తాయి.

గతంలో ఎన్నడు లేని ఎంతో ప్రశాంతంగా... సౌకర్యవంతంగా కళ్యాణ్ ఉత్సవం జరిగిందని స్థానికులు వ్యాఖ్యానించుకోవడం వినిపించింది. దేవస్థానం డిప్యూటీ ఈవో భాస్కర శర్మ, ఏఈఓ లు జూసెట్టి కృష్ణ, గజవెల్లి రమేష్, గజవెల్లి రఘు, దేవస్థానం ఈఈ దయాకర్ రెడ్డి, ఏఈ శ్రీనివాస్ రెడ్డి, పర్యవేక్షకులు శంకర్ నాయక్, దయానంద్ లు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఫిబ్రవరి
2025



# ఆలయ అర్చకులపై దాడి చేయడం దారుణం



- ఆలయాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి : కేటీఆర్

**హైదరాబాద్, ఫిబ్రవరి 10:** ఆలయ అర్చకులపై దాడులు చేయడం మంచి పద్ధతి కాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కెటీఆర్ అన్నారు. సోమవారం ఉదయం అర్చకుడు రంగరాజన్‌ను కేటీఆర్ కలిసి పరామర్శించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా చిలుకూరు బాలాజీ ఆలయంలో రంగరాజన్ కుటుంబం సేవ చేస్తోందన్నారు. రంగరాజన్‌పై దాడిని ఖండిస్తున్నామని.. ఇది పూర్తిగా ప్రభుత్వ వైఫల్యమంటూ మండిపడ్డారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు అధ్వానంగా మారాయన్నారు. ఈ దాడికి పాల్పడ్డ వాళ్ళు ఏ ముసుగులో ఉన్నా.. ఏ జెండా పట్టుకున్నా కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మళ్లీ ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు చూసుకోవాలన్నారు. అవసరమైతే చిలుకూరి బాలాజీ టెంపుల్ వద్ద భద్రతను ఏర్పాటు చేయాలన్నారు. రంగరాజన్‌ను అవమానించడం అంటే దేవుని అవమానించడమే అని అన్నారు. రంగరాజన్ కుటుంబానికి బీఆర్ఎస్ అండగా ఉంటుందని కేటీఆర్ హామీ ఇచ్చారు. మరోవైపు రంగరాజన్‌పై దాడి ఘటనలో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. రంగరాజన్‌పై దాడి ఘటనలో 17 మంది ఆచూకీని గుర్తించారు పోలీసులు. మొత్తం దాడి చేసిన వ్యక్తులు 22 మంది కాగా.. వారిలో 17 మందిని పోలీసులు కనుగొన్నారు. తెలంగాణకు చెందిన ఏడుగురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పదిమందిని గుర్తించారు. ఈ ఘటనలో వీర రాఘవ రెడ్డి ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఇతడిని ఇప్పటికే అదుపులోకి తీసుకున్న పోలీసులు రిమాండ్‌కు తరలించినట్లు తెలుస్తోంది. అలాగే వీర రాఘవరెడ్డి అనుచరులు ఐదు మందిని సోమవారం మొయినాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే పరారీలో ఉన్న వారి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

## అర్చకులు రంగరాజన్‌పై దాడి ఎంతో కలిచివేసింది : పవన్

**అమరావతి, ఫిబ్రవరి 10:** చిలుకూరులోని ప్రసిద్ధ బాలాజీ ఆలయ ప్రధాన అర్చకులు రంగరాజన్‌పై ఒక మూక దాడి చేసిందని తెలిసి తీవ్ర ఆవేదనకు లోనయ్యానని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. దురదృష్టకరమైన ఘటన ఇదని... ఈ దాడిని తీవ్రంగా ఖండిస్తున్నానని చెప్పారు. ఈ దాడిని ఒక



వ్యక్తిపై చేసినట్లుగా కాకుండా– ధర్మ పరిరక్షణపై చోటు చేసుకున్న దాడిగా భావించాలని అన్నారు. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేశారు. కొన్ని దశాబ్దాలుగా రంగరాజన్ ధర్మ పరిరక్షణకు, ఆలయాల వారసత్వ సంప్రదాయాలు, పవిత్రతను కాపాడేందుకు తపిస్తున్నారు, పోరాటం చేస్తున్నారని పవన్ కల్యాణ్ తెలిపారు. రామరాజ్యం అనే సంస్థ సభ్యులమని చెప్పి వెళ్లిన ఒక మూక రంగరాజన్‌పై దాడి చేయడం వెనుక ఉన్న కారణాలు ఏమిటో పోలీసులు నిగ్గు తేల్చాలని చెప్పారు. ఆ మూకను నడిపిస్తున్నది ఎవరో గుర్తించి కఠినంగా శిక్షించాలని కోరారు. ఈ దాడిని తెలంగాణ ప్రభుత్వం తీవ్రంగా పరిగణించాలని అన్నారు. సనాతన ధర్మ పరిరక్షణ కోసం విలువైన సూచనలను రంగరాజన్ తనకు అందించారని తెలిపారు. “టెంపుల్ మూమెంట్ ” అనే కార్యక్రమం ఏ దశలో ప్రారంభించాల్సి వచ్చిందో రంగరాజన్ తెలిపారని అన్నారు. హిందూ ఆలయాల నిర్వహణ, ధర్మ పరిరక్షణపై ఆయన ఎంతో తపన పడుతున్నారని చెప్పారు. రంగరాజన్‌పై చోటు చేసుకున్న దాడిని ప్రతి ఒక్కరం ఖండించాలని అన్నారు. చిలుకూరు వెళ్లి రంగరాజన్‌ని పరామర్శించి, అండగా ఉండాలని జనసేన పార్టీ తెలంగాణ విభాగానికి ఆదేశించారు. ఈ మే–రకు రంగరాజన్‌కు భరోసా ఇవ్వాలని పవన్ కల్యాణ్ దిశానిర్దేశం చేశారు.

## కేసీఆర్‌కు ప్రతిపక్ష హెూదా ఎందుకు?



- ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేతులు కలిపిన బీఆర్ఎస్, బీజేపీ
- టీపీసీసీ మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్,ఫిబ్రవరి10:** ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీలు చేతులు కలిపాయని టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఫాం హౌస్‌కే పరిమితమైన మాజీ సీఎం కేసీఆర్‌కు ప్రతిపక్ష హెూదా ఎందుకని ప్రశ్నించారు. గజ్వేల్ ప్రజలను పట్టించుకోకుండా ఫాంహౌస్‌లో కేసీఆర్ సేద తీరుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ దుకాణం బంద్ అయిందని అన్నారు. సోమవారం గజ్వేల్ రిమ్మన్నగూడ ఎస్ –4 వద్ద టీపీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ... కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను ఓడించడానికి బీఆర్ఎస్– బీజేపీ లోపాయికారి ఒప్పందంతో ఎన్నికలకు వస్తున్నాయని మహేష్ కుమార్ గౌడ్ చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల మాదిరిగానే ఎమ్మెల్సీ ఎన్నికల్లో పరోక్షంగా బీజేపీకి బీఆర్ఎస్ మద్దతిస్తోందని ఆరోపించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయడానికి బీఆర్ఎస్ అభ్యర్థులు కరువు అయ్యారని అన్నారు. తెలంగాణలో బీజేపీకి 8మంది ఎంపీలుంటే బడ్జెట్‌లో రాష్ట్రానికి వచ్చిన నిధులు గాడిద గుడ్డు అని ఆక్షేపించారు. ఇక్కడి బీజేపీ నేతలకు మతం పేరిట రెచ్చగొట్టి రాజకీయంగా లబ్ధి పొందడం ఆనవాయితీగా వస్తోందని ఆరోపించారు. దేశంలో మొదటిగా తెలంగాణలో కులగణన సర్వే నిర్వహించడం జరిగిందని చెప్పుకొచ్చారు. కుల గణన సర్వేతో దేశానికి ఆదర్శంగా నిలిచామని ఉద్ఘాటించారు. పారదర్శకంగా కులగణన సర్వే నిర్వహించామని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. బీఆర్ఎస్‌లో కేటీఆర్ – కవిత – హరీష్ మధ్య మూడు ముక్కలాట నడుస్తోందని విమర్శలు చేశారు. బీసీల గురించి బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతుంటే దెయ్యాలు వేదాలు వల్లించినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. కులగణన సర్వేలో పాల్గొనని కేటీఆర్, ఆయన కుటుంబ సభ్యులకు రీ సర్వే జరపమని అడిగే అర్హత లేదని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే 56 వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. నిరుద్యోగ నిర్మూలన కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధితో పనిచేస్తోందన్నారు. మాటకు కట్టుబడి ఇచ్చిన హామీలను నెరవేర్చామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రుల చొరవతో రికార్డు స్థాయిలో తెలంగాణ రాష్ట్రానికి పెట్టుబడులు వచ్చాయని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు.

# తెలంగాణలో ఏడాదిగా కౌరవ పాలన

- అధికారంలోకి వచ్చాక రైతులు సహా అందరికీ మోసం
- రైతులు భూములు గుంజుకోవడమే రేవంత్‌కు తెలుసు
- బిఆర్ఎస్ రైతు నిరసన సభలో కెటిఆర్




నారాయణపేట, ఫిబ్రవరి 10: తెలంగాణలో ఏడాదిగా కౌరవ పాలన నడుస్తోందని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. కొడంగల్‌లో కురుక్షేత్రం మాదిరిగా యుద్ధం నడుస్తోందని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రైతులు, మహిళలు, వృద్ధులు, యువతకు చేసిందేమీ లేదని ఆరోపించారు. కొడంగల్‌లో భారాస రైతు నిరసన దీక్ష సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడారు. రేవంత్ రెడ్డి ప్రజల కోసం పనిచేయడం లేదు. అనుముల అన్నదమ్ములు, అదానీల కోసమే పనిచేస్తున్నారు. రూ.కోట్లు దోచిపెట్టేందుకే పనిచేస్తున్నారు. మా ఎమ్మెల్యే సీఎం అయితే మాకు మంచి చేస్తారని కొడంగల్ ప్రజలు ఆశించారు. కానీ, రేవంత్ ప్రజల కోసం పనిచేయడం లేదు. భూములు గుంజుకోవాలనేదే ఆలోచనని అన్నారు.. రైతు బంధు డబ్బులు ఎవరికైనా వచ్చాయా?’ అని ప్రశ్నించారు. నారాయణ పేట జిల్లా కోస్గిలో జరిగిన ఒక కార్యక్రమంలో తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మాజీ మంత్రి కేటీఆర్ రైతుల సంక్షేమంపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో 25 శాతం రైతులకు రుణమాఫీ ఇంకా జరగలేదని తెలిపారు. ఈ విషయాన్ని ప్రస్తావిస్తూ, రైతుల సంక్షేమానికి తమ ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించారు. మా హయాంలో 73 వేల కోట్ల రూపాయలను 12 సార్లు రైతుల ఖాతాలకు రైతుబంధు పథకానికి అందించామన్నారు. ఇది రైతుల సంక్షేమానికి మా ప్రభుత్వం చేసిన కృషి అని తెలిపారు. కానీ ప్రస్తుతం రైతులకు ఈ ప్రభుత్వం ఒక్కొక్కరికి 17,500 రూపాయలు బాకీ ఉందని, ఈ మొత్తాన్ని త్వరలోనే చెల్లించేందుకు చర్యలు తీసుకుంటామని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కొడంగల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి నరేందర్ రెడ్డి గెలుపు ఖాయమని, ఎప్పుడు ఎన్నికలు వచ్చినా ఆయన విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఇక్కడి కంది రైతుల ధాన్యం కొనుగోలు చేయలేకపోవడం, బాధాకరమని ఆయన అన్నారు. ఏ ఒక్క గ్రామంలోనైనా పూర్తి స్థాయిలో రుణమాఫీ జరిగితే, తన ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ క్రమంలో రేవంత్ రెడ్డి రాజకీయాలపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఎక్కడ రైతులకు, పార్టీ కార్యకర్తలకు నష్టం కలిగినా మేము రక్షణగా ఉంటామని కేటీఆర్ అన్నారు. కొడంగల్ ఎత్తిపోతల పథకం కేవలం కమీషన్ల కోసమే అని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యలు ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. కోస్గి మండల కేంద్రంలో జరిగిన బీఆర్ఎస్ రైతు మహాధర్నాలో కూడా కేటీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. ముఖ్యమంత్రి నియోజకవర్గ ప్రజలు ఉప ఎన్నికల కోసం ఎదురుచూస్తున్నారని ఆయన తెలిపారు. కొడంగల్ ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి, రేవంత్ రెడ్డిని ఉప ఎన్నికకు రావాలని సవాల్ విసిరారు. బీఆర్ఎస్ అభ్యర్థి పట్నం నరేందర్ రెడ్డికి 50,000 ఓట్ల మెజారిటీ తక్కువగా వచ్చినా, తాను రాజకీయ సన్యాసం చేసేందుకు సిద్ధంగా ఉన్నానని కేటీఆర్ చెప్పారు. కొడంగల్ ప్రజలు రేవంత్ రెడ్డిని ఎప్పుడు బొంద పెడదామా అని ఎదురుచూస్తున్నారని, ఆయనపై ప్రజల ఆగ్రహం అంతగా పెరిగిందని వ్యాఖ్యానించారు. రేవంత్ రెడ్డి వ్యక్తిత్వం గురించి మాట్లాడుతూ, ’రేషం లేని వ్యక్తి కాబట్టి, ఆయన తుడిచేసుకుంటున్నారని కేటీఆర్ అన్నారు. రాష్టాన్ని ’దుర్యోధనుడు’గా అభివర్ణిస్తూ, కొడంగల్‌లో కురుక్షేత్ర యుద్ధం జరుగుతున్నట్లు చెప్పారు. రేవంత్ రెడ్డి 14 నెలల పాలనలో ఎనుముల అన్నదమ్ములు, అల్లుడు, అదానీ కోసం మాత్రమే పని చేస్తున్నారని ఆరోపించారు. లగచర్ల పచ్చని పంట భూములపై పలువురు చేసిన వ్యాఖ్యలపై 40 మంది రైతులను జైలుకు పంపడం వంటి అంశాలను ప్రస్తావించారు. కొడంగల్ రేవంత్ అయ్య, తాత జాగీరు కాదని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

## బీసీల ఓట్లు వేయించుకొని బూరడి కొట్టించిన కాంగ్రెస్

- బిసిలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే
- అప్పటివరకు మా పోరాటం ఆగదు: కవిత



**జగిత్యాల, ఫిబ్రవరి 10:** ఐఫోన్‌కు చైనా ఫోన్‌కు ఎంత తేడా ఉందో.. కేసీఆర్, రేవంత్‌కు అంతే తేడా ఉందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. చైనా ఫోన్ చూడడానికే బాగుంటుంది.. కానీ సరిగ్గా పనిచేయదన్నారు. మాటలు చెప్పి బీసీల ఓట్లు వేయించుకొని బూరడి కొట్టిన సీఎం రేవంత్ రెడ్డి.. ఏ కులంలో ఎంత జనాభా ఉన్నారో లెక్కలు ఎందుకు బయటపెట్టడం లేదని అంటూ ప్రశ్నించారు. జగిత్యాలలో కవిత విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తూతూమంత్రంగా మంత్రి పొన్నం ప్రభాకర్ బీసీ సంఘాలతో సమావేశం పెట్టారని.. స్వయంగా ముఖ్యమంత్రి ఎందుకు సమావేశమవ్వడం లేదు ? ప్రశ్నించారు. బీసీ ఉద్యమం చేస్తున్న నాయకులతో ముఖ్యమంత్రి మాట్లాడకపోవడం బీసీలను అవమానించడమేనన్నారు. బీసీ కుల సంఘాలతో ముఖ్యమంత్రి చర్చలు జరపాలని.. 42 శాతం రిజర్వేషన్లు ఇచ్చే వరకు ఉద్యమం ఆగదరన్నారు. మరో తెలంగాణ పోరాటం తరహా పోరాటానికి బీసీలంతా సిద్ధంగా ఉండాలని.. తప్పుడు జనాభా లెక్కలు చెప్పడంతో బీసీ సమాజం అట్టుడుకుతోందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే బీసీ కుల సంఘాలతో చర్చలు జరపాలని.. 52 శాతం బీసీలు ఉన్నారని 2014లోనే కేసీఆర్ లెక్క తేల్చారని..కానీ లెక్కపెట్టడం కూడా రాని రేవంత్ రెడ్డి సర్కారు తప్పుడు లెక్కలు చెబుతోందన్నారు. బీసీల సంఖ్యను తక్కువ చూపించడం శోచనీయమన్నారు. ఈ తప్పుడు లెక్కలు చెప్పి రాహుల్ గాంధీ పార్లమెంట్‌ను తప్పుదోవ పట్టించారని.. స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి బిల్లు ఎందుకు పెట్టడం లేదు ? అంటూ నిలదీశారు. 420 హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను వంచించిందని.. ఎండిపోయిన పొలాలను చూపిస్తూ రైతులు బాధపడుతున్నారన్నారు. ఎండిన పంటపొలాల ను చూస్తుంటే కన్నీళ్లు వచ్చే పరిస్థితి కేసీఆర్‌పై అక్కసుతో మేడిగడ్డ ప్రాజెక్టును వినియోగించడం లేదని.. రైతులను నీళ్లించే తెలివి లేదంటూ మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాజకీయ కక్షను పక్కనపెట్టి సీఎం రేవంత్ రెడ్డి కాళేశ్వరం నీళ్లను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఆడపిల్లలు స్కూటీలు ఇస్తామన్నారని.. మహిళలకు రూ.2500 ఇస్తామని చెప్పి ఇంకా ఇవ్వలేదన్నారు. మహిళలను చిన్నచూపు చూస్తున్న రేవంత్ రెడ్డికి కాలం గుణపాఠం చెబుతుందన్నారు. రేవంత్ రెడ్డి తప్పులను ప్రజలు లెక్కిస్తున్నారని.. తగిన సమయంలో బుద్ధి చెబుతారన్నారు. అర్హులకు వెంటనే ఇండ్లు ఇవ్వాల్సిందేనన్నారు. రేషన్ కార్డులను ఎందుకు జారీ చేయడం లేదు ? మండిపడ్డారు. రుణ మాఫీ ఎక్కడా కూడా సంపూర్ణంగా కాలేదని.. జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ బీఆర్ఎస్ పార్టీకి ద్రోహం చేసి కాంగ్రెస్‌లో చేరారన్నారు. అయినా కూడా మనోధైర్యంతో కార్యకర్తలు చెక్కుచెదరలేదని.. ఉప ఎన్నిక వస్తే జగిత్యాలలో కాంగ్రెస్ పార్టీ అడ్రస్ లేకుండా పోతుందన్నారు.

## ఎన్నికలకు ముందు కూతలు అధికారంలోకి రాగానే కోతలు

### అన్నివర్గాలను మోసం చేసిన రేవంత్ : హరీష్ రావు



**హైదరాబాద్,ఫిబ్రవరి 10 :** తెలంగాణలో ఏ వర్గాన్ని కదిలించినా కళ్లల్లో కన్నీళ్లే కనిపిస్తున్నాయని బీఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని పంటలకు బోనస్ అన్న మాట బోగస్ అని బిఆర్ఎస్ మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద నిర్వహించిన ఆర్ఎంపీ, పీఎంపీల ధర్నాలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు కూతలు.. ఎన్నికలయ్యాక కోతలని, కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే కోతల సర్కార్ అని హరీష్ రావు విమర్శలు గుప్పించారు. రైతులకు రూ. 432 కోట్ల బిల్లులు పెండింగ్ లో ఉన్నాయన్నారు. 48 గంటల్లో క్లియర్ చేస్తామని ఉత్తమ్ చెప్పారని, ఉత్తమ్ కుమార్ మాటలు.. ఉత్తర కుమార ప్రగల్భాలేనని మండిపడ్డారు. సన్న వడ్లకు బోనస్ విషయంలో రైతుల్ని దగా చేశారని తెలియజేశారు. పంటలకు ఇవ్వాల్సిన డబ్బులు కూడా ఇవ్వడం లేదని బాధను వ్యక్తం చేశారు. రైతుల్ని ఈ ప్రభుత్వం మోసం చేస్తోందని, కాంగ్రెస్ కి బుద్ధి చెప్పాలని ప్రజలు చూస్తున్నారని హరీష్ రావు స్పష్టం చేశారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చారని.. ప్రజలు హామీలు నమ్మడం లేదని బాండ్ పేపర్ల మీద రాసిచ్చిన్రు.. రాహుల్ గాంధీని తీసుకు వచ్చి హామిలిప్పించారన్నారు. సోనియా గాంధీతో లెటర్లు రాయించారని.. ఇప్పుడు హామీలన్నీ ఏమయ్యాయని ప్రశ్నించారు. 11సార్లు ఢిల్లీ పోయినా రేవంత్ రెడ్డికి అపాయింట్‌మెంట్ దొరకని పరిస్థితి నెలకొందన్నారు. పోతున్నడు వస్తున్నడు కానీ.. రాహుల్ గాంధీ అపాయింట్‌మెంట్ రేవంత్‌కు లేదన్నారు. రాహుల్ గాంధీ, సోనియా గాంధీ స్పందించి ఆర్ఎంపీ, పీఎంపీలకు సహా రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు చేయించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాడులు లేవు, కేసులు లేవని హరీశ్‌రావు గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో ఏ రాత్రి ఎవరు వస్తరో.. ఎట్ల అరెస్టులు చేస్తరో తెలయని పరిస్థితి ఉందన్నారు. ఆర్ఎంపీలను పోలీసులను పెట్టి వేధిస్తున్నారని.. ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్లు ఇస్తామని మేనిఫెస్టోలో చెప్పారని.. కేసులు పెట్టి బతుకు దెరువు లేకుండా చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ వచ్చాక అందరి బతుకులు రోడ్డున పడ్డాయని హరీశ్‌రావు ఆరోపించారు. గీత కార్మికుల పొట్ట కొడుతున్నరు. అక్రమ కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. రైతులు, నేత కార్మికులు, ఆటో డ్రైవర్లు, చివరకు బిల్డర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. మొదటి హామీ మహాలక్ష్మి, చివరి హామీ పింఛన్లు దిక్కు లేదని.. రైతు రుణమాఫీ మీద ఏ ఊర్లకైనా పోదాం చర్చిద్దామన్నారు. ఇవ్వాల్సింది రూ.45వేల కోట్లు అని.. ఇస్తానన్నది 31 అని.. ఇచ్చినా అని చెబుతున్నది 21.. ఇచ్చింది రూ.15–రూ.16వేల కోట్లు మాత్రమేనన్నారు. రుణమాఫీ ఓ మోసమని.. రూ.15–16వేల కోట్లు ఎట్ల ఇచ్చిండంటే.. వానాకాలం రైతుబంధు ఎగ్గొట్టి రూ.8వేల కోట్లు, రుణమాఫీకి ఇచ్చిండని మండిపడ్డారు. రెండు నెలల పింఛన్ 2వేల కోట్లు ఎగ్గొట్టి, రుణమాఫీకి ఇచ్చిండని.. కేసీఆర్ ఇచ్చే బతుకమ్మ, రంజాన్, క్రిస్టమస్ చీరెలు వెయ్యి కోట్లు ఎగ్గొట్టి, రుణమాఫీకి మలిపిండన్నారు. కేసీఆర్ ఇచ్చే న్యూట్రీషన్ కిట్లు, కేసీఆర్ కిట్లు బంద్ పెట్టిండని.. అందులో రెండు వేల కోట్లు.. పిల్లల ఫీజు రియింబర్స్ మెంట్ కూడా ఎగ్గొట్టిండు. రూ.2500 కోట్లు రుణమాఫీల కలిపిండని విమర్శించారు. ఇట్ల కోతలు కోసిండు రుణమాఫీలో కలిపిండంటూ హరీశ్‌రావు మండిపడ్డారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఫిబ్రవరి
2025







# మోడీకి కలిసి వస్తున్న విఫల ప్రతిపక్షం!

బాధ్యతలేని ప్రతిపక్షాల కారణంగా మోడీ ప్రభుత్వానికి చెక్ పెట్టే అవకాశం లేకుండా పోతోంది. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ తన బాధ్యతను సరిగా నిర్వహించలేక పోతోంది. దేశం ఏమైపోతున్నా పట్టించుకోవడం లేదు. బడ్జెట్ సమావేశాల్లో బాధ్యతాయుత ప్రతిపక్షంగా సమస్యలపై చర్చిస్తారని ఆశిస్తున్న దేశ ప్రజల అడియాశలు కాక తప్పడం లేదు. రాష్ట్రపతి ప్రసంగాన్ని బహిష్కరించారు. రాష్ట్రపతిపై తల్లీకుమారులు సోనియా, రాహుల్ అనుచిత వ్యాఖ్యలు చేశారు. వారి అహంకారానికి ఇది పరాకాష్ట అని చెప్పాలి. ఇకపోతే అనవసర సమస్యలపై మాట్లాడుతున్న కాంగ్రెస్, ఇండియా కూటమి నేతలు, దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలపై చర్చకు సిద్దంగా ఉండడం లేదు. ఒకప్పుడు బడ్జెట్ సమావేశాల్లో ప్రతిపక్షాలను చూస్తే అధికార పక్షం వణికి పోయేది. ఏ సమస్యను ఎక్కడ లేవదీస్తారో అన్న భయం ఉండేది. ప్రతిపాదనల్లో కోతలు విధించేవారు. సవరణలకు పట్టుబట్టేవారు. అదనపు కేటాయింపులు జరిగేలా చూసేవారు. కమ్యూనిస్టుల ప్రధానంగా ఈ పాత్ర పోషించేవారు. కానీ కమ్యూనిస్టులు లేకపోవడం, ఉన్న కాంగ్రెస్ పార్టీ అధికారానికి బాగా అలవాటై పోవడం వల్ల ప్రతిపక్ష బాధ్యతలను సరిగా నిర్వహించడం లేదు. పెళ్లిళ్ల సీజన్‌లో బంగారం వెండి ధరలు అమాంతంగా పెరుగుతున్నాయి. నిత్యావసర ధరలు విపరీతంగా పెరిగాయి. ఉప్పులు,పప్పులు సామాన్యుడికి అందనంతగా పెరుగుతున్నాయి. ఈ క్రమంలో సమావేశాల్లో ఒక్కో సమస్యపై చర్చించినా సమయం సరిపోదు. కానీ కాంగ్రెస్, ఇతర విపక్ష సభ్యులు అనవసర సమస్యలను నెత్తికి ఎత్తుకుని సభా సమయాన్ని వృధా చేసుకుంటున్నాయి. అభివృద్ధి పేరుతో బిజెపి నేతృత్వంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం ఊదర గొడుతూ కాలక్షేపం చేస్తోంది. పదేళ్ల పాటు యూపిఎ పాలన అంతా కుంభకోణాలమయంగా మారింది. వారూ ఓటమి చెందారు. తరవాత 2014లో మరోమారు బిజెపి అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు పదేళ్లుగా మోడీ నేతృత్వంలోని బిజెపి పాలన సాగుతోంది. గత 20 ఏళ్ల కాలానికి పోలిస్తే దేశంలో అభివృద్ధి అన్నది ఎండమావిగానే గుర్తించాలి. కోట్లాదిమందిని పేదరికం నుంచి బయటపడేశానని ప్రధాని మోడీ పదేపదే చెబుతున్నారు. అయితే పెరుగుతున్న ధరలతో సామాన్యులు బతకడమెలా అన్నది ఆలోచించడం లేదు. సామాన్యుడు తనకుతానుగా బతకగలిగినప్పుడే నిజమైన అభివృద్ధికి గీటురాయిగా చూడాలి. భారత్ అద్భుతమైన ప్రగతి సాధించబోతుందని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ తన బడ్జెట్ ప్రసంగంలో పేర్కొనడం చూస్తే.. ఎండమావిని చూపి నీళ్లు తాగమనే మాటలు చెబుతున్నారన్నమాట. 2047 నాటికి భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్న మాటలన్నీ డొల్లగా చూడాల్సిందే. అప్పటికి వందేళ్ల స్వాతంత్య్ర భారతం అవుతుంది. గత పదేళ్లలో 25 కోట్ల మందిని పేదరికం నుంచి బయటపడేశాం అని పదేపదే చెబుతున్నారు. నిజానికి అభివృద్ధి జరిగివుంటే ఈ దుస్థితి ఎందుకని ప్రశ్నించుకోవాలి. ప్రజలు తిండిగింజలను కొనుక్కునే పరిస్థితిలో లేరని చెప్పకనే చెప్పారు. పేద మధ్య తరగతి ప్రజలకు సొంతింటి కల ఎండమావిగా మారింది. పేదలు, మహిళలు, యువకులు, రైతులపై తమ ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పడమే తప్ప క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పట్టించుకోవడం లేదు. అంతెందుకు జిఎస్టీ సడలింపులపై ఒక్కరూ మాట్లాడడం లేదు. తానో గొప్ప విజనరీ అని చెబుతున్న చంద్రబాబు కూడా దీనిపై ఎక్కడా చర్చించడం లేదు. ఎన్‌డిఎ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు కేవలం పొగడ్తలకే పరిమితమయ్యారు. ఏ అంశాన్ని కదిలించడం లేదు, కదిలిస్తే తన రాష్ట్రానికి ఎక్కడ నిధులు రావో అన్న భయం ఆయనలో ఉంది. నితీశ్ కుమార్ తదితరులు కూడా ప్రేక్షకులుగా మారారు. ప్రధాన ప్రతిపక్షమే నాయకత్వ లోపంతో ఉంది. రాహుల్‌కు దేశంపైనా, సమస్యలపైనా అవగాహన లేకుండా పోవడం కూడా ఇందుకు కారణమని చెప్పుకోవాలి. నిజానికి జిఎస్టీపై తక్షణం ఈ సమావేశల్లో చర్చించాలి. దానివల్ల కలుగుతున్న దుష్పరిణామాలను చర్చించాలి. పన్నుల వల్ల ప్రజలు ఎంతగా దెబ్బతింటున్నారో చర్చించాలి. కాంగ్రెస్, ఇతర విపక్షాలు ఈ ఒక్క అంశంపై ఎన్నిరోజులైనా చర్చించేందుకు నిలబడగలగాలి. కానీ ఆ పని చేయడం లేదు. జిఎస్టీ వసూళ్లు నెలకు లక్షా 70 వేల కోట్లకు చేరడం చూసి అభివృద్ధి అనుకుంటున్నారు. కానీ అదంతా ప్రజలపై పన్నుల కొరడా అని గుర్తించడం లేదు. ప్రజలు స్వచ్ఛందంగా పన్నులు కట్టలేని దుర్భర పరిస్థితు ల్లో ఉన్నారు. రైతులకు కనీస మద్దతు ధరలు అన్నవి రావడం లేదు. కానీ బియ్యం, ఉప్పు,పప్పుల ధరలు మాత్రం ఏటికేడు ఆకాశాన్ని అంటుతున్నాయి. అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం అని మోసగించడం తప్ప మరోటి కాదు. దేశంలో ఎన్నో సమస్యలు పరిష్కరించడం వేరు..కానీ పేదలు, మధ్యతరగతి ప్రజలు ప్రభుత్వం అండ లేకుండానే జీవించగలగాలి. కానీ ఈ పదేళ్లలో అలాంటి అవకాశాలు లేకుండా చేశాయి. సామాన్యులు ఇల్లు కొనుక్కునే పరిస్థితి లేదు. బ్యాంక్ వడ్డీ రేట్లు దారుణంగా ఉన్నాయి. భూములు, సిమెంట్, స్టీలు ధరలను అడ్డం పెట్టుకుని బిల్డర్లు దోపిడీ చేస్తున్నారు. మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన సంస్కరణ లు ఫలితాలిస్తాయని ఆశించారు. దేశ ప్రజలు భవిష్యత్‌పై ఆశతో ఉన్నారు. ఆదాయపు పన్ను సడలింపులు, ఆర్‌బిఐ రెపోరేటు తగ్గింపులు కేవలం పైపూతలు మాత్రమే. దేశంలో పెరుగుతున్న ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, ధరల పెరుగుదల, జిఎస్టీ వంటి అంశాలపై పార్లమెంటులో చర్చించాలి. ఇందుకు ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ కసరత్తు చేయాలి. ప్రభుత్వాన్ని నిలదీయగలగాలి. ప్రజల్లో ఇమేజ్ పొందాలంటే ఇదే సమయం. బడ్జెట్ సమావేశాల్లో ప్రభుత్వాన్ని నిలదీయగలిగేంతగా బలం ప్రతిపక్షానికి ఉంది. దీనిని ఉపయోగించుకునే సామర్థ్యం రాహుల్‌కు ఉందా లేదా అన్నది చూడాలి. ప్రతిపక్షనేతగా ఎదగాలంటే ప్రజల సమస్యలపై చర్చించాలి. ఏదో ఒక పనికిరాని సమస్యను ముందుకు వేసుకుని ధర్నాలు, ప్లకార్డు ప్రదర్శనలు చేసినంత మాత్రాన ప్రజలు పట్టించుకోరు. ప్రధాన సమస్యలపై చర్చించేలా కాంగ్రెస్‌లో కూడా సరైన నేతలు కాని, సలహాలు కానీ ఇచ్చేవారు కరువయ్యారు. అందుకే మోడీని ఎదిరించేలా ప్రతిపక్ష బాధ్యతలను రాహుల్ నిర్వహించడం లేదు.

# కుంభమేళాలా భారీగా భక్తుల తాకిడి

- కిలోమీర్ల మేర నిలిచిన వాహనాలు
- సంగం రైల్వే స్టేషన్ మూసివేత



**ప్రయాగ్‌రాజ్, ఫిబ్రవరి10:** కుంభమేళాలో భక్తుల తాకిడి కొనసాగుతోంది. కోట్లమంది భక్తులు ప్రయాగ్‌రాజ్ కు పోటెత్తుతుండడంతో వందల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో విపరీతమైన ట్రాఫిక్ వల్ల స్థానిక ప్రజలు, భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అధిక రద్దీ కారణంగా ప్రయాగ్‌రాజ్ సంగం రైల్వేస్టేషన్‌ను శుక్రవారం వరకు మూసివేస్తున్నట్లు అధికారులు ప్రకటించారు. ప్రయాగ్‌రాజ్ మహాకుంభ మేళాకు వెళ్లే వారి సంఖ్య భారీగా పెరిగింది. జనసమూహం ఎంతగా ఉందంటే నగరమంతా ట్రాఫిక్‌తో ఇబ్బంది పడుతుంది. అటువంటి పరిస్థితిలో, ప్రయాగ్‌రాజ్‌లోని సంగం రైల్వే స్టేషన్ కూడా భారీ జనసమూహం కారణంగా మూసివేసినట్లు వార్తలు వచ్చాయి. దీనికి సంబంధించి రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ నుంచి ప్రకటన వెలువడింది. ప్రయాగ్‌రాజ్‌లో జరిగే మహా కుంభమేళా సందర్భంగా 8 స్టేషన్లలో రైల్వే పనులు క్రమపద్ధతిలో జరుగుతున్నాయని ఆయన అన్నారు. దీనికోసం రాష్ట్ర పరిపాలన, న్యాయమైన పరిపాలనతో సహకారం, సమన్వయంతో పని జరుగుతోంది. ఆదివారం ప్రయాగ్‌రాజ్ జంక్షన్ నుండి 330 రైళ్లు బయలుదేరాయని ఆయన చెప్పారు. ఎక్కడా సమస్య లేదు. ఎవరైనా పుకార్లు వ్యాప్తి చేయడానికి ప్రయత్నిస్తే, వాటిని పట్టించుకోవద్దని తెలిపారు. మహా కుంభమేళాకు ఊహించని రీతిలో భారీగా భక్తులు తరలివస్తున్నారు. కనీసం కాలు తీసి కాలు వేయలేనంతగా భక్తులు వస్తున్నారు. ఇసుకేస్తే రాలనంతగా భక్తులు తరలివచ్చారు. దీంతో వారణాసి, కన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు వెళ్లే మార్గాలన్నీ వాహనాలతో నిండిపోయాయి. ఇక ఆదివారం సెలవు దినం కావడంతో ఊహించని విధంగా భక్తులు తరలి రావడంతో రహదారులన్నీ వాహనాలతో కిక్కిరిపోయింది. ఇలా దాదాపు 300 కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. దీంతో భక్తులకు నరకం కనిపిస్తోంది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మహాకుంభం ప్రారంభమైనప్పటి నుంచి దాదాపు 44 కోట్ల మంది పుణ్య స్నానాలు ఆచరించారు.

# మరోమారు పడిపోయిన రూపాయి విలువ

## ట్రంప్ సుంకాల కొరడాతో మార్కెట్లో ఒడిదుడుకులు



**న్యూఢిల్లీ,ఫిబ్రవరి10:** డాలరుతో పోల్చుకుంటే రూపాయి జీవన కాల కనిష్టానికి పడిపోయింది. అంతర్జాతీయ మార్కెట్లలో ప్రతికూలతలు, స్టీల్, అల్యూమినియంపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 25 శాతం టారిఫ్ విధించడంతో దేశీయ సూచీలు సోమవారం నష్టాలతో మొదలయ్యాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 45 పైసలు క్షీణించి 87.88కి పడిపోయింది. ఈ నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తత పాటిస్తున్నారు. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి. గత శుక్రవారం ముగింపు(77,860)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం దాదాపు ఫ్లాట్‌గా మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత క్రమంగా నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో 450 పాయింట్లకు పైగా కోల్పోయి 77,396కు పడిపోయింది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదులుతోంది. ప్రస్తుతం 134 పాయింట్ల నష్టంతో 23,425 వద్ద కొనసాగుతోంది. మిగిలిన ఆసియా మార్కెట్లు కూడా నేడు మిశ్రమంగానే కదలాడుతున్నాయి. సెన్సెక్స్‌లో బ్రిటానియా, కమిన్స్, ఎన్‌సీసీ, పేజ్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో ఉన్నాయి. ఆల్కెమ్ ల్యాబ్, వేదాంత, సెయిల్, ఆయిల్ ఇండియా షేర్లు నష్టాల్లో ఉన్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 676 పాయింట్ల నష్టంతో కొనసాగుతోంది. బ్యాంక్ నిఫ్టీ 266 పాయింట్ల నష్టంతో ఉంది. డోనాల్డ్ ట్రంప్ టారిఫ్ యుద్ధం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న దేశాలను, వాటి కరెన్సీలను ప్రభావితం చేస్తోంది. సోమవారం డాలర్‌తో పోలిస్తే భారత రూపాయి విలువ 44 పైసలు తగ్గి చారిత్రాత్మక కనిష్ట స్థాయి 87.9400కి చేరుకుంది. ఉక్కు, అల్యూమినియం దిగుమతులపై 25శాతం సుంకం విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన కారణంగా ఈ తగ్గుదల సంభవించిందని చెబుతున్నారు. రూపాయి పతనం తర్వాత, భారత స్టాక్ మార్కెట్‌లో కూడా పెద్ద క్షీణత కనిపిస్తోంది. ముఖ్యంగా మెటల్ సెగ్మెంట్ షేర్లు భారీ క్షీణతను చూస్తున్నాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ తగ్గడం వల్ల సామాన్యుడి జేబుపై ప్రత్యక్ష ప్రభావం పడుతుంది. రూపాయి బలహీనపడటం వల్ల దిగుమతి చేసుకున్న వస్తువుల ధర పెరుగుతుంది. దీని కారణంగా దేశంలో ద్రవ్యోల్బణం పెరిగే అవకాశం ఉంది. డాలర్ ధర పెరిగితే వస్తువులను దిగుమతి చేసుకోవడానికి మరిన్ని రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తుంది. రూపాయి విలువ పతనం వల్ల పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతి ఖరీదైనదిగా మారుతుంది, దీనివల్ల పెట్రోల్, డీజిల్ ధరలు పెరగవచ్చు. రూపాయి బలహీనపడటం వల్ల మొబైల్ ఫోన్లు, టీవీలు, రిఫ్రిజిరేటర్లు, ఏసీలు వంటి ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల ధరలు పెరగవచ్చు. దీనికి తోడు, దిగుమతి చేసుకున్న ముడి పదార్థాల ధర కారణంగా, ఉత్పత్తి వ్యయం పెరుగుతుంది, ఇది వినియోగదారులపై ప్రభావం చూపుతుంది. విదేశాలలో చదువుతున్న విద్యార్థులకు, విదేశాలకు ప్రయాణించే విద్యార్థులకు ట్యూషన్ ఫీజులు, జీవన వ్యయాలు కూడా పెరుగుతాయి. రూపాయి విలువ పతనం కారణంగా, దిగుమతులపై ఆధారపడిన వ్యాపారాలకు సవాలు పెరుగుతుంది. ఎందుకంటే పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చు లాభాల మార్జిన్‌లపై ఒత్తిడి తెస్తుంది. విదేశీ కరెన్సీలో రుణాలు తీసుకునే కంపెనీలు అధిక తిరిగి చెల్లించే ఖర్చులను చెల్లించాల్సి ఉంటుంది. అయితే, ఎగుమతి చేసే వ్యాపారాలు, ముఖ్యంగా ఐటీ, ఫార్మా, రత్నాలు, ఆభరణాలు వంటి రంగాలు విదేశాల నుండి డాలర్లలో చెల్లింపులను అందుకుంటాయి కాబట్టి కొంత ప్రయోజనం పొందవచ్చు.

# డంకీరూట్‌లో అక్రమంగా ప్రవేశం

**సాహసంతో ప్రాణాల మీదకు తెచ్చుకున్న జనం**

**తాజాగా పంజాబీ యువకుడు దుర్మరణం**



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10:** డంకీ రూట్..అంటే దొంగమార్గమని వేరుగా చెప్పనక్కరలేదు. అగ్రరాజ్యంలో ఈ రూట్లో ప్రవేశించేందుకు యత్నించిన అనేకమంది అసవులు బాసారు. ఇందులో అనేకదేశాల వారూ ఉన్నారు. భారీతయులు కూడా ఇలా ప్రతయ్నించి ప్రాణాలు పోగట్టుకుంటున్నారు. ఈ క్రమంలోనే అక్రమంగా తమ దేశానికి వచ్చిన 104 మంది భారతీ–యులను ఇటీవల అమెరికా తిప్పి పంపిన సంగతి తెలిసిందే. అక్రమ వలసదారులపై ట్రంప్ మొదటినుంచి కఠినంగా ఉంటున్నారు. ఆయన పదవీ బాధ్యతలు చేపట్టడంతో వారి గుర్తింపు, తరలింపు ప్రక్రియను వేగవంతం చేశారు. ఈక్రమంలోనే ఇటీవల 104 మంది భారతీయులను సైనిక విమానంలో వెనక్కి పంపించిన సంగతి తెలిసిందే. దీంతో అగ్రరాజ్యంలోకి అక్రమంగా వెళ్లగలిగే మార్గాలపై చర్చ మొదలైంది. ఈనేపథ్యంలోనే తాజాగా ఓ పంజాబీ యువకుడు డంకీ రూట్ లో అమెరికా వెళ్తూ మార్గమధ్యంలోనే ప్రాణాలు కోల్పోయిన ఘటన వెలుగు చూసింది. 33 ఏళ్ల గుర్‌ప్రీత్‌సింగ్ గ్వాటెమాలాలో గుండెపోటుకు గురై మృతి చెందాడు. ఈ విషయాన్ని మృతుడి కుటుంబసభ్యులు మీడియాకు వెల్లడించారు. ‘నా సోదరుడు గుర్‌ప్రీత్ అమెరికా వెళ్లేందుకు మూడు నెలల కిందట ఇంటి నుంచి బయల్దేరారు. ఇందుకోసం చండీగఢ్‌లోని ఏజెంట్ బల్వీందర్‌సింగ్‌ను సంప్రదించాడు. అతడు రూ.16.5 లక్షలు తీసుకొని నా సోదరుడిని గయానా పంపించాడు. అక్కడ ఓ పాకిస్థానీ ఏజెంట్‌కు అప్పగించాడు. అనంతరం మరికొందరు వలసదారులతో కలిసి పనామా అడవి గుండా కొలంబియాకు బయల్దేరాడు. మధ్యలో ఓసారి మాకు ఫోన్ చేసి గ్వాటమాలాలోని హోటల్‌లో ఉన్నట్లు చెప్పారు. ఆ తర్వాత ఇటీవల ఓ వ్యక్తి మాకు ఫోన్ చేసి గుర్‌ప్రీత్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెప్పాడు. కారులో శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది పడుతున్నాడని తెలిపాడు. ఆ తర్వాత ఐదారు నిమిషాలకే నా సోదరుడు చనిపోయినట్లు సమాచారమిచ్చారు‘ అని గుర్‌ప్రీత్ సోదరుడు తారాసింగ్ మీడియాకు వివరిస్తూ కన్నీరుమున్నీరయ్యారు. తన సోదరుడి మృతదేహాన్ని తీసుకొచ్చేందుకు సాయం చేయాలని ఈసందర్భంగా ప్రభుత్వాన్ని వేడుకున్నారు. మృతుడి కుటుంబాన్ని పంజాబ్ రాష్ట్ర మంత్రి కుల్దీప్‌సింగ్ దలివాల్ పరామర్శించారు. ‘గుర్‌ప్రీత్ మరణం విచారకరం. ఎవరైనా సరే ఏ దేశానికైనా అక్రమమార్గంలో వెళ్లొద్దు. చట్టపరంగా అన్ని అనుమతులు తీసుకొని వెళ్లండి. డంకీ రూట్‌లో వెళ్లడం సరికాదని మంత్రి సూచించారు.



# పాతబస్తీలో అగ్ని ప్రమాదాలు

## సుమారుగా 30 షాపులు దగ్ధం..

### 20 ఫైర్ ఇంజన్ల సహాయంతో మంటలు ఆర్పించిన సిబ్బంది

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 :** అగ్ని ప్రమాదాలతో నగరవాసులను కంటిమీద కునుకు లేకుండాపోతోంది. ఎప్పుడు ఎటువైపు నుంచి అగ్నిప్రమాదం జరుగుతుందో అని ఆందోళన చెందుతున్నారు. తాజాగా పాతబస్తీ చార్మినార్ సమీపంలో దివాన్‌దేవిడిలో సోమవారం తెల్లవారుజామున భారీ అగ్నిప్రమాదం జరిగింది. నాలుగో అంతస్తులో ఉన్న బట్టల షాప్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్నారు. అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. వరుసగా ఉన్న పలు షాపులకు మంటలు వ్యాపించి ఆస్తి నష్టం వాటిల్లిందని వ్యాపారులు తెలిపారు. సుమారు 30కి పైగా బట్టల షాపులకు మంటలు అంటుకున్నాయి... 20 ఫైర్ ఇంజన్లు ఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చాయి. రంజాన్ పండుగా దగ్గర పడుతుండడంతో బట్టల షాపు యజమానులు కొత్త స్టాకును తెచ్చిపెట్టారు... అగ్ని ప్రమాదంలో భారీగా నష్టం జరగడంతో ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, ఫైర్ సిబ్బంది సహాయక చర్యలు ముమ్మరం చేశారు. ఆస్థి నష్టం భారీగానే జరిగినట్టు ప్రాథమిక అంచనా వేశారు. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదము జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
మంగళవారం
11 ఫిబ్రవరి
2025





# యాదగిరిగుట్ట టెంపుల్‌లో ఆన్‌లైన్ సేవలు స్పీడప్

### కొండపైకి వాహనాల ఎంట్రీని సైతం ఆన్‌లైన్ చేసిన దేవస్థానం

### క్షేత్రస్థాయిలో అమలు తీరును పరిశీలించిన ఆలయ ఈవో



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: ప్రముఖ దేవస్థానమైన యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రంలో ఆన్‌లైన్ సేవలు ఊపందుకున్నాయి. ఇప్పటివరకు ప్రసాద, దర్శనాల టికెట్లు ఆన్‌లైన్ చేసిన దేవస్థానం.. సోమవారం నుండి కొండపైకి వెళ్లే వాహనాల టికెట్ల జారీలో సైతం ఆన్‌లైన్ సేవలను అందుబాటులో తెచ్చారు. ఇప్పటివరకు కొండపైకి వాహనం వెళ్లాలంటే రూ.500 నగదు రూపంలో చెల్లించాల్సి వచ్చేది. కానీ ఇకపై ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం, యూపీఐ సేవలతో పాటు డెబిట్, క్రెడిట్ కార్డులను సైతం స్వైపింగ్ చేసి టికెట్ కొనుగోలు చేసే సదుపాయాన్ని భక్తులకు అందుబాటులోకి తెచ్చారు. నగదుతో పాటు ఫోన్ నుండి ఆన్‌లైన్ లో ఏ రూపంలో డబ్బులు చెల్లించినా.. స్వైపింగ్ మిషిన్ ద్వారా స్కానింగ్ చేసి కొండపైకి వెళ్లే వాహనాలకు టికెట్లు జారీ చేసే ఫెసిలిటీ సోమవారం నుండి అందుబాటులోకి తెచ్చారు. ఈ ప్రక్రియను సోమవారం ఆలయ ఈవో భాస్కర్ రావు ప్రారంభించి క్షేత్రస్థాయిలో అమలు తీరును స్వయంగా తెలుసుకున్నారు. కాగా ఇటీవల మ్యాన్యువల్ పద్దతిలో కొండపైకి వెళ్లే వాహనాలకు జారీ చేసే టికెట్ల విక్రయంలో అవకతవకలు జరిగినట్లు తేలడంతో.. అలాంటి వాటిని అరికట్టడానికి ఆన్‌లైన్ సేవలను అందుబాటులోకి తెచ్చారు.

# గుట్ట గుడి రికార్డు అసిస్టెంట్ సస్పెన్షన్

### అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో

### సస్పెండ్ చేసిన ఈవో భాస్కర్ రావు

యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పని చేస్తున్న రికార్డు అసిస్టెంట్ నర్సింగరావుపై సస్పెన్షన్ వేటు పడింది. ఆలయానికి సంబంధించిన డబ్బుల విషయంలో సదరు ఉద్యోగి అవకతవకలకు పాల్పడినట్లు నిర్ధారణ కావడంతో సస్పెండ్ చేసినట్లు ఆలయ ఈవో భాస్కర్ రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాల్లోకి వెళ్తే.. ఆలయంలో నర్సింగరావు అనే వ్యక్తి గత కొన్నేండ్లుగా రికార్డు అసిస్టెంట్ గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఇందులో భాగంగా ఆలయ ఘాట్ రోడ్డు వద్ద కొండపైకి వెళ్లే వాహనాలకు టికెట్లు జారీ చేసే కౌంటర్ లో డ్యూటీ చేస్తున్నాడు. టెంపుల్ రూల్స్ ప్రకారం ఒక్కో వాహనానికి సదరు వాహనదారుడి నుండి రూ.500 తీసుకుని టికెట్ ఇచ్చి కొండపైకి వాహనాలను అనుమతిస్తుంటారు. రోజు మొత్తంలో వాహనాల టికెట్ల ద్వారా సమకూరిన అమౌంట్ ను అదేరోజు బ్యాంకులో ఛాలన్ కట్టి దేవస్థానానికి చెందిన బ్యాంకు ఖాతాలో జమ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో సదరు రికార్డు అసిస్టెంట్ నర్సింగరావు దాదాపుగా రూ.58 వేల పైచిలుకు డబ్బులు దేవస్థాన బ్యాంకు అకౌంట్ లో తక్కువ జమ చేసినట్లు ఆలయ ఉన్నతాధికారుల దృష్టికి వచ్చింది. దీంతో వెంటనే అట్టి అమౌంట్ కట్టాల్సిందిగా అధికారులు ఆదేశించడంతో.. గత రెండు రోజుల నుండి సదరు రికార్డు అసిస్టెంట్ విధులకు అటెండ్ కావడం లేదు. ఫోన్ లో సైతం అందుబాటులోకి రాకపోవడంతో.. సదరు రికార్డు అసిస్టెంట్ నర్సింగరావును సస్పెండ్ చేస్తూ ఆలయ ఈవో భాస్కర్ రావు సోమవారం ఆర్డర్స్ పాస్ చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ అవకతవకలకు పాల్పడితే ఏ స్థాయి అధికారికైనా ఉపేక్షించేది లేదని ఈవో భాస్కర్ రావు హెచ్చరించారు.

# వుదయం తెలుగు దినపత్రిక క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఇందిర హాస్పిటల్ ఏం.డి మురళీ కృష్ణ, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఇందిర

యాదాద్రి భువనగిరి : వుదయం తెలుగు దినపత్రిక 2025 క్యాలెండర్ ను ఇందిర మెటర్నటి హాస్పిటల్ ఏం.డి మురళీ కృష్ణ, ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ ఇందిర చేతుల మీదుగా ఆవిష్కరించడం జరిగింది. అనంతరం ప్రముఖ స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ ఇందిర మాట్లాడుతూ... ప్రసూతి కి సంబంధించిన, పీసీఓడీ గర్భసంచికి సంబంధించిన వైద్యం అందించబడును అని, సంతనలేమితో బాధపడే వారికి ప్రత్యేక వైద్యం అందించబడునని డాక్టర్ ఇందిర అన్నారు. మా హాస్పిటల్ నందు 24 గంటల వైద్య సదుపాయం కలదని, హై రిస్క్ ప్రెగ్నెన్సీ చికిత్స ( హైబీపీ షుగర్ థైరాయిడ్ ఫీట్స్..), నార్మల్ డెలివరి, సిజేరియన్ ఆపరేషన్ లు చేయబడునని, లాప్రోస్కోపి ఆపరేషన్లు, గర్భసంచి ఆపరేషన్లు, జనరల్ వైద్య సదుపాయం కలదని, స్కానింగ్ సదుపాయము, ల్యాబ్ సౌకర్యము ఉన్నాయా అని తెలిపారు, ఏసి రూమ్స్, నాన్ ఏసి రూమ్స్, జనరల్ వార్డ్స్ సదుపాయం అందుబాటులో ఉన్నాయని, అతి తక్కువ ధరలకే గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ వైద్య సేవలు అందిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వుదయం తెలుగు దినపత్రిక యాదాద్రి భువనగిరి జిల్లా స్టాఫ్ రిపోర్టర్ సుదగాని నవీన్ గౌడ్, హాస్పటిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# టీచర్ ఎమ్మెల్సీ బరిలో కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి



**నల్గొండ, రోమింగ్ న్యూస్:** విద్యారంగ ప్రక్షాళన కోరే విద్యావేత్త, విద్యారంగంలో దీపస్తంభం కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి టీచర్స్ ఎన్నికల రంగంలో నిలిచేందుకు సోమవారం నామినేషన్ దాఖలు చేశారు. వరంగల్ నల్గొండ ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి రంగంలోకి దిగారు.

విద్యా సంస్కరణ స్వాప్నికుడు... లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్ వ్యవస్థాపక చైర్మన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యారంగంలో వినూత్నమైన మార్పులకు శ్రీకారం చుట్టేందుకే తాను ఎన్నికల బరిలో నిలుస్తున్నట్లు చెప్పారు. తెలంగాణ రాష్ట్రంలోని వరంగల్, ఖమ్మం, నల్లగొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గం ఓటర్లు అలాంటి శక్తిని ఆవాహన చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది, దశాబ్దాలుగా ఈ ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందిన అభ్యర్థులు విద్యారంగంలో ఎలాంటి చలనం తీసుకు రాలేదని ఓటర్లు అనేక సందర్భాల్లో బాహాటకంగాఆవేదన వ్యక్తం చేశారు. ఇక్కడ నుంచి గెలుపొందిన ప్రతి ఉపాధ్యాయ నేత ఆనక రాజకీయ నాయకుడిగా చలామణి అవుతూ స్వప్రయోజనాలకు పెద్ద పీట వేసుకొని ఓటర్ల ఆకాంక్షను ఆలోచనను ఏనాడు పట్టించుకోలేదు. అయితే ఇప్పటివరకు మూసగా సాగుతున్న ఈ ఎన్నిక ఒక్కసారిగా కొత్త ఆలోచనను రేకెత్తించిందనే చెప్పాలి. మూడున్నర దశాబ్దాలకు పైగా విద్యారంగంలో లక్షలాదిమంది చిన్నారులనుమేధావులుగా, ప్రయోజకులుగా మార్చి అద్భుత ఫలితాలు సాధించి అనంతర కాలంలో ఆయా విద్యార్థులు ఎన్నో ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడడానికి కారకులైన లోటస్ ల్యాబ్ విద్యాసంస్థల అధినేత, తెలంగాణ గ్రీన్ అంబాసిడర్, ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ జాతీయ సలహాదారులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఈ దఫా టీచర్స్ ఎమ్మెల్సీగా పోటీ చేయడం ఈ నియోజకవర్గంలో భారీ మార్పుకు సంకేతాలు ఇస్తోంది. ఆయన పోటీ, గెలుపు ఈ రాష్ట్రంలోని విద్యా వ్యవస్థను సమూలంగా మార్చి వేస్తుందన్న అభిప్రాయాన్ని ఓటర్లు వ్యక్తం చేస్తున్నారు. నిజానికి కోమటిరెడ్డి గోపాల్ రెడ్డికి ఎన్నికల కంటే విద్యార్థులకు చదువు చెప్పడంలోనే ఆయన ఆనందాన్ని అనుభవిస్తారు. ఆయన చదువు చెప్పడాన్ని ఆయన ఆస్వాదిస్తారు. అందుకే ఆయన విభిన్న పద్ధతుల్లో చదువులో బలహీనంగా ఉన్న అనేకమంది విద్యార్థుల్లో అద్భుత ఫలితాలు వచ్చేలా సరికొత్త పద్ధతుల్లో విద్యాభ్యాసం చేయించేవారు. అనేక కొత్త పద్ధతుల్లో... అక్షరాలు పలకలేని విద్యార్థులను సైతం ఉత్తములుగా తీర్చిదిద్దిన మేధో సంపత్తి ఆయనది. నిజానికి టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీ చేయాలనే ఆలోచన ఆయనకంటే ఆయన అభిమానులు, ఆయన స్నేహితులు పర్యావరణవాదులు, విద్యార్థుల తల్లిదండ్రుల ఒత్తిడే కారణమని చెప్పాలి. విద్యారంగం ఏటికేడు దిగదుడుపు ఫలితాలు ఇవ్వడాన్ని ఆయన జీర్ణించుకోలేక విద్యా వ్యవస్థ సమూల ప్రక్షాళన కోసం ప్రభుత్వాధినేతలను కలిసి విజ్ఞప్తి చేసిన సంఘటనలు ఉన్నాయి. అంతేకాక విదేశాల విద్యా వ్యవస్థలో ఉన్న ఉత్తమ విధానాలను పరిశీలించేందుకు ఆయన సొంత ఖర్చులతో వెళ్లి వచ్చిన సందర్భాలు అనేక ఉన్నాయి. మూస విద్యా విధానం భావిభారతాన్ని నాశనం చేస్తుందన్న ఆవేదన కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి నిరంతరం వ్యక్తం చేస్తుంటారు. ఆంగ్లేయులు మొదలు వెళ్లిన విద్యవిధానం ఊడిగం చేయడానికి తప్ప వ్యవస్థ బలోపేతానికి ఉపయోగపడదని ఆయన బలంగా నమ్ముతుంటారు. ఒక వ్యక్తి గాని, ఒక వ్యవస్థ గాని అభివృద్ధి సాధించాలంటే విద్యారంగం బలంగా ఉండాల్సిన అవసరం ఉందంటారు.

విద్యార్థులు చదువుకు మాత్రమే పరిమితం కాకుండా సామాజిక విలువలు, పర్యావరణ పరిరక్షణపై ఆలోచనలు, కుటుంబ బాధ్యతలు, చివరకు వంటలపై కూడా వారికి అవగాహన ఉండాలని చెప్పడం ఆయన సామాజిక దార్శనికతకు నిదర్శనం. తన పిల్లలతో కూడా అతి చిన్న వయసు నుంచే వంటవార్పుకు దగ్గర చేశాడు. ఒక విద్యార్థి తన మేధోసంపతితో తను మాత్రమే అగ్రస్థానం చేరుకోవడం కాకుండా వంద మందిని ఉద్యోగులుగా మార్చే పారిశ్రామిక ప్రగతికి విద్యార్థుల్లో బీజం వేస్తుంటాడు. ఇలాంటి ఆలోచనపరుడు సమాజం పట్ల బాధ్యత, భావుకత ఉన్న గోపాల్ రెడ్డి... విద్యారంగంలో నెలకొన్న ఒడిదుడుకులు అధిగమించాలంటే ఖచ్చితమైన కార్యాచరణ ఉండాలో తెలిసిన అగ్రగణ్యుడు. ఎలాంటి సమస్యనైనా ఆత్మవిశ్వాసంతో, ఆలోచన దృష్టితో పరిష్కరించుకోవడం మనిషికి సాధ్యమేనని విద్యార్థుల్లో సెల్ఫ్ కాన్ఫిడెన్స్ ను నిరంతరం పెంచే సజ్జనశీలి. అతి పేదరికం నుంచి వచ్చి నేడు విద్యారంగంలో అగ్ర స్థాయిలో నిలబడిన కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి విద్యా వ్యవస్థలో నెలకొన్న వైఫల్యాలను సంస్కరించడమే తొలి ప్రాధాన్యంగా భావించి ఎన్నికల రంగంలోకి దూకడం రేపటి తరానికి ఒక మేలు సంకేతం. వ్యవస్థను కానీ, వ్యక్తిని కానీ సంస్కరించే శక్తి ఒక ఉపాధ్యాయుడికి ఉంటుందనేది వాస్తవం. అలాంటి ఉపాధ్యాయ రంగంలో మూడు దశాబ్దాలకు పైగా కృషి చేస్తూ ఉన్న గోపాల్ రెడ్డికి ఈ ఎన్నికల విజయం... విద్యారంగ పెను మార్పుకు ఒక వాహకంగా ఉపయోగపడుతుందని వాస్తవం. వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ నియోజకవర్గంలో ఉన్న 25 వేలకు పైగా ఉపాధ్యాయ ఓటర్లు నేడు ఉత్తమ అభ్యర్థి కోసం ఎదురుచూస్తున్న తరుణంలో కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి నామినేషన్ వేయడం వారిలో కొత్త ఆలోచనలకు తెర లేపింది. నిజానికి ఆయా ఓటర్లకు వారి వారి సంఘాలు ఉన్నా కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి గెలుపును వారంతా అంతర్లీనంగా కోరుకుంటున్నారన్న వార్తలు వస్తున్నాయి. కారణం ఇప్పటివరకు ఈ నియోజకవర్గం నుంచి గెలుపొందిన నాయకులు అనంతర కాలంలో రాజకీయ నేతలుగా ఎదిగి సంస్కరణ మర్చిపోయారన్న ఆవేదన వారిలో నెలకొంది. కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి అనేక స్కూళ్ల ద్వారా లక్షల విద్యార్థులను అద్భుత ప్రయోజకులుగా తీర్చిదిద్దుతూ అనేకమంది పేద విద్యార్థులకు ఉచిత విద్య అందించడం కూడా ఆయనకు ఈ ఎన్నికల్లో సానుకూల పవనాలు వీచే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి అనేక సామాజిక, పర్యావరణ కార్యక్రమాలతో రాష్ట్రపతి నుంచి పలువురు ముఖ్యమంత్రిలు, మంత్రుల చేతుల మీదుగా అవార్డులు, పురస్కారాలు అందుకున్న సామాజిక ఆశావాది. విద్యారంగ మార్పును నిరంతరం కాంక్షించే విద్యావేత్త అయినా గోపాల్ రెడ్డిని... ఈ ఎన్నికల రంగంలో నిలబడి తట్టుకోగలవా అని కొందరు ఆయన ఆలోచనకు బ్రేకులు వేసే ప్రయత్నం చేసినా కొత్త రాజకీయాన్ని, సరికొత్త సంస్కరణను కోరుతూ అడుగులేస్తున్నానని, అందుకు విజ్ఞులుగా తొలి మెట్టు మీద ఉండే ఉపాధ్యాయులు అర్థం చేసుకుంటారని నమ్ముతున్నానని, గెలుపు నాదైనా విజయం వారిదే అవుతుందని ఆయన పేర్కొనడం ఆలోచించే పరిణామం. ఈ విజయం రేపటి వారి పిల్లలు నికార్సైన వ్యక్తులుగా తయారయ్యేందుకు అవకాశం ఏర్పడుతుందని, అలాంటి వ్యక్తుల సమూహంతోనే భావి భారతం ప్రపంచానికి దిక్సూచిలా మారుతుందని కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి పేర్కొనడం ఆయన ఆత్మ విశ్వాసానికి, సామాజిక దృక్పథానికి నిలువెత్తు నిదర్శనం. మరి ఉపాధ్యాయులుమూస రాజకీయాన్ని కొనసాగిస్తారా? కొత్త భారతాన్ని సృష్టించేందుకు వారధి కడతారా అనేది చూడాలి మరి..!



# క్రిస్టియన్లంతా సంఘటితం కావాలి

### నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ ...

### జనగామ డిస్ట్రిక్ట్ అధ్యక్షుడు

### రాజకుమార్ రోడ్రిక్స్

జనగామ ఫిబ్రవరి 10: (రోమింగ్ న్యూస్) అన్యమతస్తులను గౌరవిస్తూ, క్రైస్తవులంతా సంఘటితమై ఐకమత్యంగా ఉంటే ప్రస్తుత సమాజంలో క్రైస్తవులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలను పరిష్కరించుకోవచ్చని నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ జనగామ జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన రాజ్ కుమార్ రోడ్రిక్స్ అన్నారు. జనగామ లోని షామీర్పేట్ చర్చిలో సోమవారం జరిగిన ఎన్నికలలో ఆయనతోపాటు ప్రధాన కార్యదర్శి గా రమావత్ జోసెఫ్, కోశాధికారి గా ప్రీతి దయాళ్ తదితరులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రైస్తవుల మీద జరుగుతున్నటువంటి దాడులు, వ్యతిరేకతలు, చిన్న చూపు, అనేకమైన హింసలు, వ్యతిరేకతలు, అత్యాచారాలు అవమానాలను, ఇతర సమస్యలను క్రైస్తవులంతా ఐకమత్యంగా ఉంటేనే పరిష్కరించుకోవడం సాధ్యమవుతుందని ఆయన అన్నారు. సమాజంలో అందరితో కలిసి మెలిసి ఉంటూ బైబిల్ చెప్పిన



విధంగా నడుచుకుంటూ క్రైస్తవ సమాజాభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాల్గొని ఆశీర్వదించిన పెద్దలు ,నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ తెలంగాణా రాష్ట్ర అధ్యక్షులు బిషప్పు సంజయ్ఆనంద్ ,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిషప్పు, బక్క ఎలియా , మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు ప్రసన్న బోల్ట్ , పొలిటికల్ గవెర్నర్ విభాగం రాష్ట్ర అధ్యక్షులు కాశీ సతీష్ కుమార్ ,రాష్ట్ర కార్యదర్శి బొల్లము సునీల్ రీజనల్ చైర్మన్ పోలేపాక దానియేలు తదితరులకు జనగామ అధ్యక్షులు రాజకుమార్ కృతజ్ఞతలు తెలిపారు





# సకల కళల సవ్యసాచి దోరవేటి

**సాహిత్యం పట్ల ప్రేమ, తపన ఉన్నవారి అభివ్యక్తి అనేక రూపాలలో వ్యక్తమవుతుంది. అది కథ కావచ్చు, నవల కావచ్చు, గేయం కావచ్చు, పద్యం కావచ్చు. ఇలా అనేక ప్రక్రియలలో సాహితీ సృజన చేస్తున్న సాహితీకారులు అరుదుగా కనిపిస్తారు. అటువంటివారిలో విశిష్టులు దోరవేటి. రంగారెడ్డి జిల్లా ధారూర్ వీరి స్వగ్రామం. ఇది మండల కేంద్రంగా ఉన్నది. ధారూర్ పూర్వనామం దోరవీడు. తన జన్మస్థలం అయిన దోరవేటిని తన కలంపేరుగా మార్చుకున్న పల్లె ప్రేమికుడు దోరవేటి. వీరి అసలు పేరు ఉప్పరి చెన్నయ్య. దోరవేటిగానే సాహితీలోకానికి సుపరిచితులు.**

ఉప్పరి అడివయ్య - ఈశ్వరమ్మ దంపతులకు 11-2-1961న రంగారెడ్డి జిల్లా ధారూర్ లో చెన్నయ్య జన్మించారు. దోరవేటి నిరుపేద కుటుంబంలో జన్మించారు. రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో తల్లిదండ్రులు కూలిపనులు చేస్తూ కుటుంబ భారాన్ని మోశారు.


దోరవేటికి బాల్యంలోనే ఈతకొట్టడం, అడవుల్లో తిరగడం, క్రమం తప్పకుండా బడికి వెళ్లడం ఇష్టమైన పనులు. బాల్యం నుండే పురాణాలు, సాహిత్యం పట్ల మక్కువ ఎక్కువ. ఇవి అతని బాల్యంపై చెరగని ముద్ర వేశాయి. తెల్లవారుజామునే నిద్రలేవడం, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వంటి క్రమశిక్షణ ఆనాడే అలవడింది.

**దోరవేటి గారి తండ్రి అడివయ్య జానపద కళాకారుడు కావడం వలన పాఠశాల విద్యార్థిగా ఉన్నప్పుడే ఆ కళారూపాలలో పురాణేతిహాసాలను ఆసక్తిగా గమనించి ఆకళింపు చేసుకున్నారు. ఆ ప్రభావమే ఆయనను సాహిత్య కళారంగాల వైపు ఆకర్షితులను చేసిందని చెప్పవచ్చు.సుమారు నాలుగు దశాబ్దాల ఉపాధ్యాయ జీవితం దోరవేటి గారిది. ఈ నేపథ్యంలోనే ఉపాధ్యాయుడుగా, అధ్యాపకుడిగా, శిక్షకుడిగా వివిధ సంస్థలకు తన సేవలను విస్తృతంగా అందించారు. వికారాబాద్లో ఉద్యోగంలో ఉన్ననాడే స్థానిక బాలకేంద్రంలో పిల్లలకు లలిత సంగీతం, నృత్యంలో శిక్షణ నిచ్చారు. పాఠశాల విద్యార్థుల అవసర నిమిత్తం తాను బోధించే చిత్రలేఖనంతో పాటు తెలుగు, ఆంగ్లం, గణితం మొదలైన విషయాలు బోధిస్తూ క్రికెట్, ఫుట్బాల్, బ్యాడ్మింటన్ వంటి ఆటల్లో, సంగీత నృత్య నాటక కళల్లో శిక్షణను ఇచ్చేవారు. ఒక్కమాటలో చెప్పాలంటే తన ఉద్యోగ జీవితాన్ని సర్వమూ విద్యార్థులకు అంకితం చేసిన వృత్తి ప్రేమ ఆయనది. పాఠశాలకు సకాలంలో కంటే ముందు చేరుకోవడం, అందరికంటే చివరన వెళ్ళడం వృత్తి జీవనమంతా కొనసాగించారు. ప్రార్థన సమయానికి బడికి చేరుకోలేకపోతే సగంరోజు సెలవు పెట్టుకొని విధులు నిర్వర్తించేవారు. ఆయన అంకిత భావానికి ఇంతకన్నా నిదర్శనాలు అవసరంలేదు. అందుకే విద్యార్థులు మొదలు అధికారుల దాకా అందరికీ ఆయన ప్రియమైన వ్యక్తి అయ్యారు. చిత్రలేఖనోపాధ్యాయుడుగా ఉంటూనే తనకున్న తెలుగు బోధనానుభవం, సాహిత్యాభి నివేశనం కారణంగా మొదట జిల్లాస్థాయిలో, తర్వాత రాష్ట్రస్థాయిలో రిసోర్స్ పర్సన్ గా మారారు. ఈ నేపథ్యంలోనే (2004లో) వరంగల్ (జుజులో), పదోన్నతి (2010లో) సాధించారు. పాఠ్యపుస్తక రచయితగా ఎంపికయ్యారు.**

మరొకపక్క పత్రికల ద్వారా (ఈనాడు, వెలుగు, సాక్షి) విద్యార్థులకు, ఉపాధ్యాయ శిక్షణ అభ్యర్థులకు అవసరమైన సమాచారాన్ని 2001 నుండి 2012 వరకు సుమారు పన్నెండు సంవత్సరాల పాటు అందజేశారు. టి.వి., రేడియో (%ా×జు - క్ష్ఫ్వ ×అర్ఙ్బ్వ శీట జుఎబఎ్ఘ్అశీఅ ఎముఎ్ష్ట్రఅస్ర్%) రూపొందించి ప్రదర్శించారు. (కవల పిల్లలు 8వ తరగతి, పిలుపు - 9వ తరగతి, దమ్మపదం - 9వ తరగతి, తామసి 10వ తరగతి, వ్యాకరణాంశాలు, తెలుగు పద్యాలు - బోధన విధానం, సీత ఇష్టాలు- బుర్రకథ (7వ తరగతి). చిన్నప్పుడే 8వ తరగతి మొ.వి). వీటిలో తాను పనిచేస్తున్న పాఠశాల పిల్లలకు కూడా అవకాశం కల్పించి, వాళ్ళకు మరచిపోలేని స్మృతులను నిలిపారు. చిత్రలేఖనంలో కూడా వీరి శిష్యులు జాతీయ, దక్షిణ భారత, రాష్ట్ర, జిల్లా స్థాయిలలో ఎన్నో బహుమతులతో పాటు ప్రశంసలను, గుర్తింపును పొందారు. వీరు రాసిన 'అమ్మ' పాట ఆకాశవాణి శ్రోతల మనసులు గెలుచుకోవడమేగాక 'పాడుతా తీయగా కార్యక్రమంలో ఎస్.పి. బాలసుబ్రహ్మణ్యం ప్రశంసలందుకున్నది. వీరి లలిత గీతాలు, నృత్యాలు, నృత్య రూపకాలు వీరికేగాక శిష్యులకు కూడా మంచిపేరు తెచ్చిపెట్టాయి. 1993లోనే పాడరా ఓ భరతవీర ! అనే దేశభక్తి గీతాల క్యాసెట్ (ఆడియో)ను, జానపద గేయాల క్యాసెట్ను విడుదల చేశారు.

దోరవేటి బహుముఖ ప్రజ్ఞాశాలి. కవిగా, కథకుడిగా, నవలాకారుడిగా, చిత్రకారునిగా, నాట్య చార్యునిగా, గాయకుడిగా, తబల వాయిద్యకారునిగా, వేణునాదంలోను, క్రీడాకారునిగా ఇలా అనేక కళల్లో దోరవేటికి ప్రవేశం ఉన్నది. చాలా కళల్లో నిపుణత్వం సాధించారు. దోరవేటి చిన్నతనం నుండే కళలపట్ల అభిరుచి పెంచుకున్నారు. చిన్నప్పటినుంచి చిత్రలేఖనం అలవడింది. సంగీతం, జానపద కళల్లో ప్రవేశానికి ఇంటి వాతావరణం తోడు అయ్యింది. తన తండ్రి భాగవతం నేర్పే పంతులు కావడం, భాగవతం అనేక కళల సమాహారం కావడం వల్ల ఆయా పాత్ర పోషించడం, పాటలు పాడటం, లయబద్ధంగా అడుగులు వేయడం చిన్నప్పటి నుంచే అలవడ్డాయి. ఆ తర్వాత కాలంలో పద్మశ్రీ నటరాజ రామకృష్ణ వద్ద ఆంధ్ర నాట్యంలో ప్రాథమిక శిక్షణ పొందారు. ప్రముఖ సంగీత విద్వాంసులు శ్రీ దయానంద్ గారి వద్ద సంగీత శిక్షణ పొందారు. విద్యాపీఠం ఘోష్ ద్వారా వేణువు పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఎంతో సాధనచేసి అద్భుతమైన వేణుగానంలో పరిణతి సాధించారు, దోరవేటికి ఆటలు అంటే ఎంతో మక్కువ. ప్రత్యేకించి క్రికెట్ పట్ల ఎక్కువ ఆసక్తి చూపుతారు. దాంతోపాటు బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ ఆటల్లో ఎంతో ప్రావీణ్యం సంపాదించారు. ఆరుపదుల వయస్సు దాటినా నేటికీ క్రమం తప్పకుండా ఈ ఆటలు ఆడుతుండటం విశేషం. దోరవేటికి చిత్రకళ పట్ల ప్రత్యేక ఆసక్తి. తాను పరిగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతిలో ప్రవేశించి నప్పుడు బొమ్మలు గీయడానికి తనకంటూ ప్రత్యేకమైన నోటు పుస్తకం లేకపోవడంతో పాత నోటు పుస్తకాల నుండి పేపర్లు చించి అన్నీ కలిపి ఒక నోట్సులాతయారుచేసుకొని ఆ నోటు పుస్తకానికి ముఖచిత్రంగా అప్పటి నోట్లపై ఉండే చిత్రాన్ని అచ్చుకంటే అందంగా చిత్రించారు. ఇది ఆ పాఠశాలలోని ఉపాధ్యాయులను, విద్యార్థులను ఆశ్చర్యచకితులను చేసింది. దోరవేటిలోని ప్రతిభను గుర్తించిన ఆనాటి డ్రాయింగ్ మాస్టారు రామాచారి దోరవేటిచే డ్రాయింగ్ లోయర్, హయ్యర్ పరీక్షలు రాయించారు. దానికి కొనసాగింపుగా ఇంటర్లో మరో చిత్రకళ ఉపాధ్యాయుడు సిద్దప్ప శిక్షణలో పర్స్పెక్టివ్ పేపర్లో కూడా ఉత్తీర్ణత సాధించి చిత్రకళ ఉపాధ్యాయునిగా కొలువుకు కావలసిన అర్హత పొందారు. ప్రముఖ కవి కోటం చంద్రశేఖర్ ఇంటర్లో దోరవేటి సహాధ్యాయి. చంద్రశేఖర్ గారి నాన్నగారే శ్రీ సిద్ధప్ప గారు. వీరే పర్స్పెక్టివ్ డ్రాయింగ్లో శిక్షణ నిచ్చారు. అనంతరం శిశుమందిర్లో ఉపాధ్యాయుడిగా చేరిన దోరవేటి నాటి నుండి నేటివరకు ఎందరో విద్యార్థులను గొప్ప చిత్రకారులుగా తయారుచేశారు. దోరవేటి కూడా ఉపాధ్యాయ వృత్తితో పాటు కమర్షియల్ ఆర్టిస్టుగా కూడా పనిచేశారు. సైన్బోర్డ్స్, బ్యానర్స్, పాంప్లెట్స్ వంటివి వాటర్, ఎనామిల్ కలర్స్తో చేసేవారు. అనేక పుస్తకాలకు ముఖచిత్రాలు, లోపలి బొమ్మలు వేశారు. కాపు రాజయ్య ప్రేరణతో గ్రామీణ జీవితంపై పెయింటింగ్ వేశారు. తాను రాసిన పుస్తకాలకు తానే ముఖచిత్రాలు, లోపలి బొమ్మలు వేసుకున్నారు. ప్రభుత్వ పాఠ్యపుస్తకాలకు రచయితగా 2009 - 2010 కాలంలో ఉర్దూ తెలుగు పాఠ్య పుస్తకాలకోసం చిత్రకారునిగా సేవలు అందించారు. అప్పటి తెలుగు పాఠ్యపుస్తకాలకు ముఖచిత్రాలు గీశారు.

**దోరవేటి హరికథ, బుర్రకథ, ఒగ్గుకథ, సంవాదం, అభినయ గేయం, రూపకం, ఏకపాత్రాభినయం వంటి కళలను ప్రదర్శించి రంగస్థల కళాకారుడిగా పేరు పొందారు. గుంటూరులో జరిగిన సరస్వతి విద్యాపీఠంలో ఆచార్య శిబిరంలో దోరవేటి శకుని ఏకపాత్ర అభినయం అందరి ప్రశంసలు పొందడమే కాక ప్రథమ బహుమతి తెచ్చిపెట్టింది.**



( నేడు దోరవేటి గారి జన్మదినం సందర్భంగా...)

అదే శిబిరంలో బుర్రకథ అద్భుతంగా ప్రదర్శించారు. ఇట్లా శకుని, కర్ణ, భరతమాత, అల్లూరి సీతారామరాజు, చాళుక్య, వివేకానంద, పిట్టలదొర, రైతు, తెలంగాణ తల్లి, భాగ్యరెడ్డి వర్మ, బలి చక్రవర్తి వంటి పౌరాణిక, చారిత్రక సమకాలీన సమాజ పాత్రలను తాను స్వయంగా రచించి తన విద్యార్థులచేత ప్రదర్శింపచేశారు. వివేకానంద, సోదరి నివేదిత, వరకట్నం, బడిమానేయకు అనే గేయ నాటికలు రచించి విద్యార్థుల చేత ప్రదర్శింపచేశారు. భువన విజయం, కైలాస సభ రూపకాలను రచించి ప్రదర్శింపచేశారు. వీరు రచించిన అజరామరం నాటకం రంగారెడ్డి వికారాబాద్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే కాక దేశ రాజధాని ఢిల్లీలో కూడా ప్రదర్శింపబడి పలువురు ప్రశంసలు అందుకుంది. ఇటీవల బ్రహ్మచారి శివ శంభో సినిమాలలో మాటలు పాటలు రచయిత గానే కాక శివ శంభో సినిమాకు సంగీత దర్శకుడిగా, అలాగే నటుడిగా తమ ప్రతిభాపాటవాలను కనబరిచారు.

ఈవిధంగా నవరసాలను ఒలికిస్తూ దోరవేటి నటుడిగా, నాట్యచారునిగా సుప్రసిద్ధులు అయ్యారు.దోరవేటి బాల్యం నుండే సాహిత్యం, కళలపై ఆసక్తి కలిగినవారు. తన చిన్నతనంలో పుస్తక పఠనం ప్రధాన వ్యాపకంగా ఉండేది. పాఠశాల గ్రంథాలయంలో ప్రేమ్చంద్, శరత్ సాహిత్యం ఎక్కువగా చదివేవారు. మరోపక్క ఎదురింటి రామచంద్రారావు గారు పురాణాలు, కావ్యాల్లోని పద్యాలు, కథలు వినిపించటం దోరవేటి సాహిత్యం వైపు మళ్లడానికి ప్రేరణగా నిలిచాయి.

**దోరవేటి ఎనిమిదవ తరగతి చదివే రోజుల్లోనే 'గజదొంగ గంగన్న' అనే 200 పేజీల నవలను రాశారు. ఇంటర్మీడియట్లో ఉండగా 'వక్రరేఖలు' అనే పేరుతో మరొక నవల రాశారు. 1986 ప్రాంతంలో 'గురుకులం' అనే మరో నవల రాశారు. ఈ మూడు నవలలు అముద్రితాలు. చదువుకునే రోజుల్లోనే భక్తిగీతాలు మొదలైన పాటలు రాసేవారు. దోరవేటి రాసిన తొలికథ 'కల' ఆంధ్రప్రభ(వారపత్రిక)లో 1992లో అచ్చు అయ్యింది. ఆ తర్వాత మాధవుడు అనే కథ రాశారు. మాధవుడు కథలో కథానాయకుడు తన ఆత్మీయ స్నేహితుడైన కడియాల మధు-సూదనరావు, సరస్వతీ విద్యాపీఠం ఉపాధ్యాయుడిగా ఉన్నప్పుడు రంగస్థల కళలకు కావలసిన స్క్రిప్టన్నీ సొంతంగా రాసుకోవడం అలవాటైంది. అనంతరం వీరు రాసిన గేయాలను హృదయస్పందన పేరుతో సంపుటిగా ప్రకటించారు. ప్రముఖ అష్టావధాని శ్రీ మలుగ అంజయ్యతో కలిసి 'శ్రీ సాయి శతక సంకీర్తనావళి' 1999లో ప్రకటించారు. తర్వాత 1999 లోనే అమృతఝరి కథలు, 2000 సం. లో జరజూస్కో కథలు, నేస్తం శతకం, 2003లో కాపాడే దేవతలు కథలు, 2005లో 'కానుక' కథలు, 'అంజలి' సాలంకృత ఖండకావ్యం 2006లో 'నాన్నకు జేజే' కథల సంపుటి/ కథలు, 2006లో అంజలి సాలంకృత ఖండకావ్యం, 2007లో సంబంధం కథలు, పద్యం రసనైవేద్యం విమర్శ వ్యాసావళి, బూచాడొచ్చాడు నవల, 2009లో బసవ పంచశతి కావ్యం, 2011లో పల్లెకథలు, చదవేస్తే వ్యంగ్య వ్యాసావళి, 2012లో ఆచార్యదేవోభవ, 2014లో భారతీయ కళలు, శరణు బసవ, మనకవులు మహాకవులు, 2015 లో మరో శివాజీ, అసమానవీ-రుడు అనురాగ దేవత, అంజలి - 2, వాగ్గేయకారుడు శ్రీశ్రీశ్రీ రాకమచర్ల వేంకటదాసులవారి జీవితచరిత్ర, 2016లో జీవనది, చరితార్థులు, సాంబశివ శరణం, 2019లో సాగర్ల సత్తయ్య (ఈ గ్రంథ రచయిత) సంపాదకత్వంలో దోరవేటి బాలసాహిత్యం కథలు, గేయాలు, పద్యాలు మీకోసం అనే గ్రంథంగా సంకలనం చేయబడ్డాయి. దోరవేటి సాహిత్య సాంస్కృతిక ప్రస్థానంపై డా. రాయరావు సూర్యప్రకాశ్ సంపాదకత్వంలో విపంచి అనే సంకలనం వెలువడింది. 2020లో దోరవేటి శ్రమదేవోభవ ఖండకావ్యాన్ని వెలువరించారు. ఇవికాకుండా ఆంధ్రప్రభ పత్రిక 'పయనమెచటికోయి' అనే ధారావాహిక 2006 ఆగస్టు నుండి అక్టోబర్ వరకు డైలీ సీరియల్గా ప్రచురితమయ్యింది. మరొక ధారావాహిక 'కలల కాసారం' వెలుగు మాసపత్రికలో ప్రచురితమయ్యింది.**

'శంఖారావం' ధారావాహికను 2008-2009 మధ్యకాలంలో సందీపని పత్రిక ప్రచురించింది. జాగృతి పత్రిక 5 వారాల ధారావాహికగా 'బూచాడొచ్చాడు' బాలల నవలను ప్రచురించింది. 2008- 2009 కాలంలో భారతీయ పరిరక్షణ పత్రికలో 'నవభారతం' ధారావాహిక ప్రచురించబడింది. ఈవిధంగా కవిగా, కథకుడిగా, నవలా కారుడిగా, వ్యాసకర్తగా దోరవేటి తన సాహిత్య ప్రస్థానాన్ని కొనసాగించారు.

దోరవేటి కవి, రచయిత మాత్రమే కాక అవధానిగా కూడా ప్రసిద్ధులు. గేయావధానంతో పాటు అష్టావధానం వంటి వినూత్నమైన అవధానాలు చేశారు. దూరదర్శన్ 'పద్యాల తోరణం' కార్యక్రమంలో, ఈటీవి 'స్మైల్ రాజా స్మైల్' కార్యక్రమంలో పాల్గొని ప్రేక్షకుల మన్ననలందుకున్నారు. గేయావధానంలో ఏ లయ చెప్పినా ఆ లయలో పాటను ఆశువుగా చెప్తారు. ఇచ్చిన అంశంపై పాట పేరడి, రాగానికి అనుకూలంగా పాట, దత్తపదులతో పాట, అప్రస్తుత అంశాలకువివరణ, పద్యాన్ని పాటలుగా చెప్పడం, ఆశువుగా పాట వినిపించటం మొదలైనవాటిలో చక్కని ప్రావీణ్యతను కనబరుస్తారు.



( వ్యాసకర్త దోరవేటి సమగ్ర సాహిత్యం అధ్యయనం అనే అంశంపై పరిశోధన చేశారు )
- డాక్టర్ సాగర్ల సత్తయ్య
7989117415

దోరవేటి మలుగ అంజయ్య అవధానితో కలిసి వికారాబాద్, పెద్దెముల్, మంచాల, పరిగి ప్రాంతాలలోనే కాకుండా వరంగల్, హైదరాబాద్లలో జంటగా అవధానాలు చేశారు. దోరవేటి 2004లో ఉపాధ్యాయ పండిత శిక్షణ తీసుకుంటున్న సమయంలో వరంగల్ వేయి స్తంభాల గుడిలో మిత్రులు మలుగు అంజయ్యావధానితో కలిసి చేసిన అష్టావధానం పలువురి ప్రశంసలు అందుకుంది. ఇటీవలికాలంలో కరోనా కారణంగా కాలు బయటపెట్టలేని పరిస్థితిలో కూడా జూమ్ ఆన్లైన్ వేదికగా 4 అష్టావధానాలు చేశారు. అనంత సాహిత్య సాంస్కృతిక సంస్థ వ్యవస్థాపకులుగా ఎందరో కవులను కళాకారులను తీర్చిదిద్దుతున్న గౌరవేటి తెలుగు సాహిత్యంలో అరుదైన బహుముఖ ప్రజ్ఞాశాలి.

# ఈనెల 25 నుండి పాలకుర్తి జాతర

**మార్చ్ 1 వ తేదీ వరకు మహాశివరాత్రి ఉత్సవాలు**
**పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి**
**జనగామ జిల్లా కలెక్టర్ భాష**




జనగామ ఫిబ్రవరి 10(రోమింగ్ న్యూస్) : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 25వ తేదీ నుండి మార్చి 1వ తేదీ వరకు పాలకుర్తి లోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం జాతర తో పాటు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ జాతర కొరకు భారీగా తరలివచ్చే భక్తులకు విస్తృత ఏర్పాట్లు చేపట్టనున్నట్లు జనగామ కలెక్టర్ రిజ్వాన్ భాషా అన్నారు. త్రాగునీరు, తాత్కాలిక మరుగుదొడ్లు, వైద్య సౌకర్యాలు భక్తులకు 24 గంటలపాటు అందుబాటులో ఉంచాలని ఆయన అధికారులను ఆదేశించారు. జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా అదనంగా బస్సులు ఏర్పాటు ఆయన పలు సూచనలు చేశారు పోలీసు శాఖ బందోబస్తు ఏర్పాటుచేసి నిరంతరం పర్యవేక్షణ చేపడుతుంది అని కలెక్టర్ వివరించారు

జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మహాశివరాత్రి పర్వదిన సందర్భంగా జరగబోయే ఉత్సవాల తో పాటు పాలకుర్తి లోని శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం జాతర నిర్వహిస్తున్నందున డిసిపి రాజమహేంద్ర నాయక్, అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ లతో కలిసి సంబంధిత అధికారులతో ఆలయ ప్రాంగణ మందిరంలో సంబంధిత అధికారులతో కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సోమవారం నిర్వహించిన సమన్వయ సమావేశం లో ఆయన మాట్లాడారు. ఈ




సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భక్తుల కొరకు ఆర్టీసీ అధికారులు తొర్రూరు, సూర్యాపేట, హనుమకొండ బస్సు డిపోలనుండి అదనంగా బస్సులను వేయాలన్నారు. పోలీస్ శాఖ గుర్తించిన ఐదు పార్కింగ్ ప్రదేశాలలో ప్రైవేట్ వాహనాలను నిలుపుదల చేయించాలని అందుకు భక్తులు సహకరించాలన్నారు. ఇంజనీరింగ్ శాఖ అధికారులు ప్రమాదాలు జరగకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. దైవ దర్శనానికి వచ్చే భక్తులు ఇబ్బంది పడకుండా బార్ కేడింగ్ చేపట్టాలన్నారు. అదేవిధంగా ఘాట్ రూట్ లో త్రాగునీరు ఇబ్బందులు కలగరాదన్నారు. జాతరకొచ్చే భక్తులు వాహనాల వేగాన్ని నియంత్రించేలా స్పీడ్ లిమిట్ సూచికలు ఏర్పాటు చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు తెలిపారు. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జాతరకు సుదూర ప్రాంతాల నుండి ఎడ్లబండ్లపై భక్తులు తరలిరానున్నందున పశువులకు ఎలాంటి వ్యాధులు సోకకుండా ఉచితంగా వైద్యం అందించాలన్నారు. జాతర నిర్వహిస్తున్న వారం రోజులు ఆలయం విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా కనిపించాలని, ఆలయ ప్రాంగణమంతా లైట్లు ఏర్పాటు చేసి భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు. ఉత్సవ నిర్వహణ అధికారులు ఈనెల 22వ తేదీన మరొకసారి సమావేశం కావాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం మహాశివరాత్రి జాతర ఉత్సవాల నిర్వహణ క్యాలెండర్ను ఆయన ఆవిష్కరించారు. ఈ సమన్వయ సమావేశంలో జాతర నిర్వహణ నోడల్ అధికారి ఆర్డీవో వెంకన్న, డిఆర్డిఓ వసంత, జిల్లా వైద్య అధికారి మల్లికార్జున్ రావు, డిపిఓ స్వరూప, పోలీస్, ఎక్సైజ్, దేవాదాయ శాఖ అధికారులు, తాసిల్దార్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
Roaming News







## సూపర్ స్టార్ చివరి సినిమాలో శృతి ఎంట్రీ..!

తమిళ్ సూపర్ స్టార్ విజయ్ రాజకీయ అరంగేట్రం చేసిన నేపథ్యంలో సినిమాల నుంచి తప్పుకోబోతున్నాడు. చివరగా జన నాయగన్ అనే సినిమాతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. షూటింగ్ స్పీడ్‌గా జరుగుతున్న ఈ సినిమాను ఇదే ఏడాది ప్రేక్షకుల ముందుకు తీసుకు వచ్చేందుకు గాను ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ సినిమాలో హీరోయిన్‌గా శృతి హాసన్ నటించబోతుందనే వార్తలు వస్తున్నాయి. దాదాపు పదేళ్ల క్రితం వీరిద్దరు కలిసి పులి అనే సినిమాలో నటించారు. బాక్సాఫీస్ వద్ద ఆ సినిమా డిజాస్టర్‌గా నిలిచింది. దాంతో మరోసారి వీరి కాంబోలో సినిమా రాలేదు. మళ్లీ ఇన్నాళ్లకు విజయ్ చివరి సినిమాలో శృతి హాసన్‌కు నటించే అవకాశం దక్కింది. హెచ్ వినోద్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో ఒక హీరోయిన్‌గా ఇప్పటికే పూజా హెగ్డే నటిస్తున్న విషయం తెల్సిందే. పూజా హెగ్డే పై కొన్ని సీన్స్ సైతం చిత్రీకరణ చేశారు. ఈ సమయంలో మరో హీరోయిన్‌గా శృతి హాసన్ అంటూ వస్తున్న వార్తలు ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నాయి. బాక్సాఫీస్ వద్ద భారీ విజయాన్ని సొంతం చేసుకునే విధంగా జన నాయగన్ సినిమాను రూపొందించే ఉద్దేశ్యంతో ఈ సినిమాను భారీ బడ్జెట్‌తో రూపొందిస్తున్నారు. పైగా ఈ సినిమా విజయ్ కెరీర్‌లో చివరి సినిమాగా నిలువబోతున్న కారణంగా ప్రతిష్టాత్మకంగా రూపొందిస్తున్నారు. అందుకే ఈ సినిమాకు ఎక్కడా రాజీ పడటం లేదని దర్శకుడు వినోద్ చెప్పుకొచ్చారు.

## ప్లీజ్.. ఇలాంటి రూమర్స్ స్ప్రెడ్ చేయకండి.. రకుల్ ప్రీత్ సింగ్

'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్' సినిమాతో టాలీవుడ్ ఇండస్ట్రీకి ఎంట్రీ ఇచ్చిన రకుల్ ప్రీత్ సింగ్ అనతి కాలంలోనే మంచి గుర్తింపు తెచ్చుకుంది. తన అందం, నటనతో ప్రేక్షకుల్లో ఎంతో పాపులారిటీ తెచ్చుకుంది. అలాగే నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ తన అంద చందాలతో వావ్ అనిపిస్తుంది. ఈ క్రమంలో ఈ భామ చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న రకుల్ తన మ్యారేజ్ టైంలో ఇచ్చిన డ్యాన్స్ పర్ఫామెన్స్ పై వచ్చిన ట్రోల్స్, ఫాల్స్ న్యూస్ పై స్పందించింది. ఆమె మాట్లాడుతూ.. "జనాలు ఎందుకు ఈ విషయాన్ని వదలడం లేదో నాకు అర్థం కావడం లేదు. ముందు నేను ఈ డ్యాన్స్ ప్రోగ్రామ్ చేయడానికి ఒకటికి మూడింతలు రెమ్యునరేషన్ తీసుకున్నానన్నారు. తర్వాత ఐటీ దాడి జరిగిందని ప్రచారం చేశారు. నాకు చాలా కోపాన్ని తెప్పిస్తోంది. ఈ రూమర్స్‌తో మా నాన్న చాలా బాధపడుతున్నారు. ఒక్కరు కూడా నిజ నిజాలు పరిశీలించడం లేదు కదా, కనీసం నన్ను అడగడం లేదు. నేను మీడియాతో చాలా ఓపెన్‌గా ఉంటాను. నా జీవితానికి సంబంధించిన ప్రతి విషయాన్ని వారితో పంచుకుంటాను. మీకు నా గురించి ఏమైనా సందేహాలు ఉంటే నన్ను అడగండి. కానీ ఇలాంటి మాటలు మాత్రం పుట్టించొద్దు" అంటూ చెప్పుకొచ్చింది. ప్రస్తుతం రకుల్ చేసిన ఎమోషనల్ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. ఇక దీనిపై ఆమె ఫ్యాన్స్ మీరు ఎవరికీ సమాధానం చెప్పాల్సిన పనిలేదు, మీరెంటో మాకు తెలుసు అంటూ కామెంట్స్ చేస్తున్నారు.



## జీవితంలో ఏదేదో అనుకుంటాం .. కానీ

"జీవితంలో మనం అనుకునే సిద్ధాంతా లు, ఊహలు ఏవీ వాస్తవాలు కావు. ఇతరుల కంటే మనమే గొప్ప తెలివైనవా ళ్లం అను కుంటాం. సందర్భం వచ్చినపు డు జీవితం మన మెడలు వంచి పాఠాలు నేర్పుతుంది" అని బాలీవుడ్ నటి కరీనా కపూర్ తన ఇన్‌స్టాగ్రాం స్టోరీలో హార్ట్ ఈమోజీతో తాజాగా పోస్టు చేశారు. భర్త సైఫ్‌అలీఖాన్‌పై ఇటీవల ఓ ఆగంతుకుడు కత్తితో జరిపిన ప్రాణాంతక దాడి నేపథ్యంలో ఆమె పెట్టిన ఈ పోస్టులో ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "ఈ పెళ్లిళ్లు, విడాకులు, ఆందోళన లు, పిల్లలు పుట్టడం, ఆత్మీయుల మరణాలు, పిల్లల పెంపకం.. ఇవన్నీ మనదాకా వస్తేనే పూర్తిగా అర్థమవుతా యి" అన్నారు. గత నెల 16న సైఫ్‌పై దాడి జరిగిన రోజున కరీనా "మా కుటుంబానికి ఎంతో సవాలుతో కూడిన రోజు" అని సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యానించారు. "ఏమి జరిగిందో మాకే ఇప్పటికీ పూర్తిగా అర్థం కావడం లేదు. ఈ కష్ట సమయంలో కనికరం లేని ఊహాగా నాలు, కథనాలకు దూరంగా ఉ ండాలని మీడియాకు, ఫొటోగ్రాఫ ర్లకు సవినయంగా మనవి చేస్తున్నా" అని ఆమె అప్పట్లో రాసుకొచ్చారు.

Printed, published and owened by GOTTIPARTHI MADHURI, printed at MADHURI OFFSET PRINTERS H.NO 3-133, BC colony yadagirigutta, dist : Yadadri Buvanagiri pin : 508115, Ts Publictions at Madhuri publications. Editor : GOTTIPARTHI BHASKER. RNA TELTEL /2021/80986